

ఎద్దుమైలారం ఓడీఎఫ్ సందర్శనకు వచ్చిన కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీకి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సంగారెడ్డి

సోమవారం 28 ఆగస్టు 2017

గో బ్యాక్

- కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీకి నిరసన సెగ
- రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించొద్దంటూ ఉద్యోగుల ధర్నా
- ఉద్యోగాలివ్వాలని భూ నిర్వాసితుల నిరసన
- ప్రొటోకాల్ పాటించలేదని రోడ్డెక్కిన సర్పంచ్




భానూరు బీడీఎల్ పరిశ్రమ వద్ద రక్షణ శాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, అధికారులు

కంది మండలంలోని ఓడీఎఫ్ ఫ్యాక్టరీకి ఆదివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ విచ్చేశారు. ప్రధాన గేటు వద్ద ఉద్యోగ సంఘాలు, భూనిర్వాసితులు, ఎద్దుమైలారం గ్రామ సర్పంచ్ ఆందోళన నిర్వహించారు. ఓడీఎఫ్ ఫ్యాక్టరీలో బీఎంపీ, బీఎంపీ-2 యుద్ధట్యాంకుల బార్ కోడ్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పటాన్‌చెరు మండలం బీడీఎల్ ఫ్యాక్టరీని సందర్శించారు. అస్త్ర క్షిపణి ప్రాజెక్టు కార్యాలయం, ఐదు మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు.

2

కళకళలాడుతున్న సింగూరు ప్రాజెక్టు



'సింగూరు' గలగల

మంజీర ఎగువన భారీ వర్షాలు

- ప్రాజెక్టుకు పోటెత్తిన వరద
- ఇన్‌ఫ్లో 10 వేలు క్యూసెక్కులు
- 19.779 టీఎంసీలు నిల్వ

2



ప్రాజెక్టులో 522 మీటర్ల నీటి మట్టాన్ని సూచిస్తున్న స్కేలు

జూన్, జూలై నెలల్లో కురిసిన వర్షాలకు సింగూరు ప్రాజెక్టులో 19 టీఎంసీలకు చేరింది. ఖరీఫ్ సీజన్‌లో ప్రాజెక్టు ఎడమ కాల్వ, ఘనపురం ఆయకట్టుకు జలాలను వదలడంతో నీటి మట్టం తగ్గిపోయింది. తాజాగా శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి దాదాపు 10 వేల క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చి చేరింది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మంజీర నది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షం కురియడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 523.60 మీటర్లు కాగా 521.500 మీటర్ల నీరు చేరింది.



రైతు మృతి చెందడంతో రోదిస్తున్న భార్య, కూతురు (ఫైల్)

కన్నీటిని ఆపేదెవరు ?

- రైతు ఆత్మహత్యతో రోడ్డున పడిన కుటుంబం
- ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

3

సకాలంలో చికిత్స అందించాలి

- అతిసారను అదుపుచేస్తాం
- సంపూర్ణ పారిశుధ్యానికి అందరూ కృషి చేయాలి
- సిద్ధాపూర్‌తండాను పరిశీలించిన ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్

3

రోగుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్



పాలిటెక్నిక్ కళాశాలకు మోక్షం

• నేడు విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిచే ప్రారంభోత్సవం



దాసుగడ్డ తండాలో నిర్మించిన నూతన పాలి టెక్నిక్ కళాశాల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి రూరల్ : ఎట్టకేలకు పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనానికి మోక్షం లభించింది. స్థానిక ప్రభుత్వ ఐటీఐ వెనుక భాగంలో ఉన్న శిథిలమైన భవనంలో పాలిటెక్నిక్ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామ పంచాయతీ పరిధిలోని దాసుగడ్డ తండ సమీపంలో పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించేందుకు రూ.5.15 కోట్ల నిధులను కేటాయించారు. భవన నిర్మాణం పూర్తయిన ప్రారంభోత్సవం చేయలేదు. ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'కళాశాల భవనం ప్రారంభమయ్యేనా' అనే శీర్శికను కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. విద్యార్థుల అవస్థలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి కళాశాల ప్రారంభోత్సవానికి సహకరించిన 'ఆంధ్రజ్యోతి'కి విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మంత్రుల పర్యటన

సంగారెడ్డి అర్బన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం సంగారెడ్డి, కంది మండలాల్లో పర్యటించనున్నారు. సంగారెడ్డి మండలం దాసుగడ్డతండా సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభించనున్నారు. కలబ్‌గూర్‌లో పశువుల మార్కెట్ యార్డ్‌ను ప్రారంభించనున్నారు. అలాగే కంది గ్రామంలో వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, బాలుర, బాలికల వసతి గృహం ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు.



ప్రసంగిస్తున్న పీసీసీ కార్యదర్శి డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి

అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న సీఎం కేసీఆర్

• పీసీసీ కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్‌రెడ్డి

రాయపోల్: సీఎం కేసీఆర్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ కాలం వెల్లదీస్తున్నారని, ఇలాంటి జిమ్మిక్కు రాజకీయాలు ప్రజలు సహించరని పీసీసీ కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయపోల్‌లో నిర్వహించిన 'కాంగ్రెస్ యువగర్జన సదస్సు'లో ఆయన మాట్లాడారు. అంతకన్నా ముందుగా దౌల్తాబాద్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. రాయపోల్ వరకు కార్యకర్తలు పెద్దఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్‌ముదిరాజ్, పరశురాములు, భాస్కర్, ప్రవీణ్, ప్రశాంత్, ఎల్లం, స్వామి, శివారెడ్డితో పాటు పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. రాయపోల్, దౌల్తా బాద్, మిరుదొడ్డి, చేగుంట, నార్సింగ్ మండలాలకు సుకేందర్‌రెడ్డి, స్వామి, భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్, మహేశ్‌ను యువజన కాంగ్రెస్ కన్వీనర్లుగా నియమిస్తూ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణ వచ్చాక ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో లెక్క చెప్పాలన్నారు. దుబ్బాక నుంచే కేసీఆర్ పాలనకు తిరుగుబాటు మొదలవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షుడు రాజిరెడ్డి, దశరథరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, నాయకులు మల్లారెడ్డి, దార సత్యనారాయణ, భూపతిరావు, వెంకటయ్య, జగపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆది బాలకృష్ణ, మల్లేశం, కిష్టారెడ్డి, మాధవరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

గో బ్యాక్

• కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీకి నిరసన సెగ
• రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించొద్దంటూ ఉద్యోగ సంఘాల ధర్నా
• భూ నిర్వాసితుల నిరసన
• ప్రొటోకాల్ పాటించలేదని రోడ్డెక్కిన సర్పంచ్





ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న భూనిర్వాసితులు, నిరసన తెలుపుతున్న సర్పంచ్ దశరథ్

కంది : గో బ్యాక్.. గో బ్యాక్ కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ గో బ్యాక్ అంటూ ఓడీఎఫ్‌లో నినాదాలు మార్మోగాయి. మండల పరిధిలోని ఆయుధ కర్మాగారంలో బీఎంపీ, బీఎంపీ-2 యుద్ధట్యాంకుల బార్ కోడ్ పద్ధతిని కేంద్ర ఆర్థిక, రక్షణ శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఆదివారం ప్రారంభించారు. కేంద్రమంత్రి పర్యటనను నిరసిస్తూ ఓడీఎఫ్ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద ఆల్ ఇండియా డిఫెన్స్ ఫెడరేషన్ (ఏఐడీఈఎఫ్) ఆధ్వర్యంలో ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా ధర్నా చేయగా, ఓడీఎఫ్ ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర మంత్రి పర్యటనలో ప్రొటోకాల్ పాటించలేదంటూ స్థానిక ఎద్దుమైలారం గ్రామ సర్పంచ్ దశరథ్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలు జరుగుతున్న సమయంలో కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ హెలికాప్టర్‌లో వచ్చి కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి వెళ్లిపోయారు. కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా ఓడీఎఫ్ పరిసర ప్రాంతాల్లో స్థానికులను లోనికి అనుమతించకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడక్కడ పోలీసులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

విదేశీ నినాదాన్ని ప్రోత్సహిస్తున్నారు

కేంద్ర రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించ వద్దంటూ ఏఐడీఈఎఫ్ ఆధ్వర్యంలో ఓడీఎఫ్ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద ఆందోళనకు దిగారు. కేంద్ర మంత్రి పర్యటన తెలుసుకున్న ఆ సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐడీఈఎఫ్ అధ్యక్షుడు ఎం.అర్జున్ మాట్లాడుతూ స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ విదేశీ నినాదాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. రక్షణ రంగాన్ని ప్రైవేటీకరిస్తే దేశానికి పెను ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. లాభాల కోసం రక్షణ వస్తువులను ఉగ్రవాదులకు అమ్మే అవకాశం ప్రైవేట్ రంగానికి లేకపోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగాన్ని ప్రైవేట్ పరం చేయకుండా ఔట్‌సోర్సింగ్ విధానాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

161 మందికి ఉద్యోగాలివ్వండి

ఆయుధ కర్మాగారం ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన తమకు పరిశ్రమలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ భూనిర్వాసితులు ఓడీఎఫ్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఓబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, భూ నిర్వాసితుడు కల్లు నర్సింలుగౌడ్ మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన 672 పట్టాదారుల్లో 511 మంది పట్టాదారులకు ఉద్యోగాలు ఇచ్చి మిగిలిన 161 మంది పట్టాదారులకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఒక పట్టాకు ఒక ఉద్యోగం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చి 161 మందిని విస్మరించారని విమర్శించారు. గతంలో రెండు దఫాలుగా ఇంటర్వ్యూలు నిర్వహించి వదిలేశారే తప్ప ఉద్యోగాలు ఇవ్వలేదని నర్సింలు తెలిపారు.

సర్పంచ్ నిరసన

కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ పర్యటనకు తనను ఆహ్వానించలేదని నిరసిస్తూ ఎద్దుమైలారం గ్రామ సర్పంచ్ దశరథ్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి ప్రథమ పౌరుడినైన తనను ఓడీఎఫ్ అవమానించిందన్నారు. పరిశ్రమ అభివృద్ధి విషయంలో స్థానికులను విస్మరించడం అధికారులకు పరిపాటిగా మారిందన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను వెలికితీసి మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్న భయంతోనే తనను ఆహ్వానించలేదని విమర్శించారు. తనకు పిలుపు రాకపోయినా ఉద్యోగస్తులు, భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తానని సర్పంచ్ దశరథ్ తెలిపారు.

కేంద్ర మంత్రికి వినతి

ఎంపీవీ, బీపీవీ ప్లాంట్ తయారీకి అనుమతి, పరిశ్రమ కారణంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఓడీఎఫ్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ ప్రసాద్ కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీకి వినతిపత్రం అందించారు.

భానూర్ బీడీఎల్‌లో జైట్లీ

పటాన్‌చెరు: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం భానూర్‌లోని కేంద్ర ఆయుధ తయారీ పరిశ్రమను(బీడీఎల్) కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ ఆదివారం సందర్శించారు. పరిశ్రమలోని అస్త్ర క్షిపణి ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించారు. పరిశ్రమ అవసరాల కోసం నిర్మించిన ఐదు మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి దేశీయంగా డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన అస్త్ర క్షిపణి విజయవంతమైందన్నారు. ప్రస్తుతం పది క్షిపణులు తయారు చేయాలని నిర్ధేశించుకున్నా సమీప భవిష్యత్తులో 50 క్షిపణులు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశ రక్షణ రంగ అవసరాలకు సరిపడా బడ్జెట్‌ను కేటాయిస్తున్నామన్నారు.

'సింగూరు' గలగల

• మంజీర ఎగువన భారీ వర్షాలు
• ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

పుల్‌కల్ : సింగూరు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి నీటి ఉధృతి పెరిగింది. గడిచిన ఏడాది ఇదే నెలలో వరద నీటి చేరిక ప్రారంభమైంది. అయితే వారం రోజులుగా మంజీర నది పరివాహక ప్రాంతంలోని జహీరాబాద్, నారాయణఖేడ్, ఝరాసంఘం, కోహీర్, రాయికోడ్, న్యాల్‌కల్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి స్వల్పంగా వరద నీటి రాక ప్రారంభమైంది. తాజాగా శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి దాదాపు 10 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. గడిచిన యాసంగిలో సింగూరు ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా కొత్తగా ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు ఘనపురం ఆయకట్టు రైతాంగానికి నీటిని విడుదల చేయడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ 17 టీఎంసీలకు పడిపోయింది. ఈ ఏడు ఖరీఫ్ సీజన్ ఆరంభంలో జూన్, జూలై మాసాల్లో కురిసిన వర్షాలకు నీటి నిల్వ 19 టీఎంసీలకు చేరింది. మళ్లీ ఖరీఫ్ సీజన్‌లో సింగూరు ప్రాజెక్టు ఎడమ కాల్వ, ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు పలు విడతలుగా పెద్ద ఎత్తున కాలువ ద్వారా జలాలను వదలడంతో నీటి మట్టం తగ్గిపోయింది. ఈ నెల 21న 975 క్యూసెక్కులు రాగా, 22న 5,858, 23న 8,331, 24న 3,340, క్యూసెక్కులు నీళ్లు రాగా, శని, ఆదివారల్లో కలిపి 10 వేల క్యూసెక్కుల వరద నీరు చేరింది. శుక్రవారం కాస్తా వరద తగ్గగా, శనివారం మళ్లీ వరద నీటి రాక పుంజుకున్నది. ఆదివారం ఉదయం నాటికి 6,386 క్యూసెక్కులు నీరు రాగా, అది సాయంత్రానికి ఒక్కసారిగా 10 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం గణనీయంగా పెరుగుతున్నది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాల్లో కూడా భారీ వర్షం కురువడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం నాటికి ప్రాజెక్టులో నీటి మట్టం 20 టీఎంసీలు దాటనున్నది.



సింగూరు ప్రాజెక్టులోకి కొత్త నీటి రాకతో జలకళ

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 523.60 మీటర్లు. (1793 అడుగులు) 30 టీఎంసీల సామర్థ్యం. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 521.500 మీటర్లకు (1710 అడుగులు) 19.779 టీఎంసీల నీరు చేరింది. వర్షాలు మరో రెండు, మూడు రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో వరద ఉధృతి కొనసాగే అవకాశాలున్నాయి.

సింగూరులోకి ఉధృతంగా వరద నీరు



సింగూరు ప్రాజెక్టులో వరద నీటి ఉధృతి కొనసాగుతుందని సింగూరు ప్రాజెక్టు డీఈఈ బాలగణేష్ తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోని మంజీర నది క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆయా ప్రాంతాలకు తమ సిబ్బందిని నియమించాం. ఎప్పటికప్పుడూ వరద నీరు ఏ మేరకు ఉన్నది, ఎంత ఉధృతి వస్తుందనేది సమాచారం అందిస్తున్నారు. ప్రాజెక్టులోకి గతేడాది ఆగస్టు నెలాఖరులో వరద నీటి రాక ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం గణనీయంగా ఉంది. ప్రాజెక్టులో సోమవారం నాటికి 20 టీఎంసీలు దాటనున్నది. ఎప్పటికప్పుడూ వరద ఉధృతిని పరిశీలిస్తున్నాం. రాత్రింభవళ్లు ప్రాజెక్టు వద్దనే ఉండి నీటి రాకను అంచనా వేస్తున్నాం.

- బాలగణేష్, సింగూరు ప్రాజెక్టు డీఈఈ

'డీఎస్సీ' రాలేదని.. తిండి మానేసి

నిరుద్యోగి మృతి



రామక్రిష్ణ మృతి చెందడంతో రోదిస్తున్న సోదరి, ఇన్‌సెట్లో రామక్రిష్ణ మృతదేహం

నారాయణఖేడ్: డీఎస్సీ ప్రకటన కోసం ఎదురు చూస్తూ దిగులుతో నిరుద్యోగి మృతి చెందిన సంఘటన నారాయణఖేడ్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన మన్నెపు రామక్రిష్ణ (30) 2014లో బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేశాడు. ఆయన ఇటీవల టెట్ పరీక్ష కూడా రాసినప్పటికీ ప్రభుత్వం డీఎస్సీ విషయంలో జాప్యం చేస్తుండడంతో మనస్తాపానికి గురై నెల రోజులుగా భోజనం మానినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో అనారోగ్యానికి గురైన రామక్రిష్ణను చికిత్స నిమిత్తం శనివారం సంగారెడ్డి వైద్యశాలకు తరలించినప్పటికీ రాత్రి సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామక్రిష్ణ తండ్రి లక్ష్మయ్య ఏడు సంవత్సరాల క్రితమే చనిపోయాడని దీంతో కుటుంబ భారం ఆయనపైనే పడడంతో ఎలాగైనా ఉద్యోగం పొందాలనే ఆలోచనతో ఆయన బీఎడ్ పూర్తి చేయడమే కాకుండా ఆయన సోదరి బాగ్యలక్ష్మితోను బీఎడ్ పూర్తి చేయించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం డీఎస్సీ ప్రకనటన రేపు మాపు అంటూ జాప్యం చేస్తుందని, దీనికి తోడు ఇటీవల టెట్ పరీక్ష నిర్వహించినప్పటికీ డీఎస్సీ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వక పోవడంతో ఆయన మనస్తాపానికి గురయ్యాడన్నారు. తనకు ఉద్యోగం వస్తుందో రాదో అంటూ ఉద్యోగం వచ్చే వరకు వివాహం కూడా చేసుకోనని తెలుపడమే కాకుండా నెల రోజులుగా భోజనాన్ని మాని వేసినట్లు వారు తెలిపారు. శనివారం పరిస్థితి విషమించడంతో సంగారెడ్డి వైద్యశాలకు తరలించినప్పటికీ రాత్రి అక్కడే మృతి చెందాడని వారు తెలిపారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటూ కుటుంబ భారాన్ని మోస్తాడనుకున్న రామక్రిష్ణ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తల్లి, సోదరి రోదనలు మిన్నంటాయి. రామక్రిష్ణ మృతి చెందడంతో శాస్త్రీ నగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.

రైలు ఢీకొని పశువుల మృతి

జహీరాబాద్: రైలు ఢీకొని ఆరు పశువులు మృతి చెందిన సంఘటన జహీరాబాద్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన సంగారెడ్డి, తిరుపతిరెడ్డి పాలేర్లు 8 పశువులను పొలాలకు తరలిస్తున్న క్రమంలో రైలు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో నాలుగు గేదెలు, రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందగా మరో రెండు పశువులు తీవ్రగాయాలకు గురయ్యాయి. సుమారు 3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. గతంలో కూడా ఈ గేటుపై పశువులు మృతి చెందాయని గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన పశువులను రైతులు అక్కడికక్కడే ఖననం చేశారు.



రైలు ఢీకొని మృతి చెందిన పశువులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ములుగు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన వంటిమామిడి రాజీవ్ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. కీసర మండలం యాదరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బాలయ్యాను, వంటిమామిడిలో ఆయన రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న 108సిబ్బంది గజ్వేల్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు పోలీసులు తెలిపారు.

గుర్జకుంట వాగు సమీపంలో లారీ బోల్తా

చేర్యాల: గుర్జకుంట-కొముురవెల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు లారీ బోల్తాపడగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సిద్దిపేట నుంచి చేర్యాలకు వస్తున్న లారీ కొముురవెల్లి క్రాసింగ్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో లారీ క్యాబిన్ ధ్వంసంకాగా, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కాగా, లారీ బోల్తాపడిన సమీపంలోనే వడ్రంగి కార్మికుడి డబ్బా ఉండగా తృటిలో నష్టం తప్పింది.

సకాలంలో చికిత్స అందించాలి

• అధికారులను ఆదేశించిన ఎమ్మెల్సీ ఫరీదొద్దీన్

కోహీర్: మండల పరిధిలోని గొటిగార్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సిద్దాపూర్ తండాలో ఈ నెల 24వ తేదీ నుంచి చాలా మంది గిరిజనులకు అతిసార వ్యాధి సోకడం వల్ల వైద్య చికిత్సల కోసం నానా ఇబ్బందులు పడ్డారు. సకాలంలో వైద్యులు, అధికారులు స్పందించకపోవడం వల్ల రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో అధికారులు, వైద్యులు మేల్కొని ఆదివారం అతిసార వ్యాధి సోకిన రోగులకు వైద్య చికిత్సలు అందించడంతో కొంతమేర అతిసార వ్యాధి అదుపులోకొచ్చింది. ఈ పని ముందే చేసి ఉంటే ఇంతమందికి వ్యాధి సోకేది కాదని తండావాసులు పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గిరిజనులకు తాగేందుకు ప్రత్యేక ట్యాంకర్ ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు. అయితే వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగు నీరు కూడా పూర్తిగా అపరిశుభ్రంగా ఉంది. దీంతో తండావాసులకు సురక్షితమైన తాగు నీరు ప్రస్తుతం అందడం లేదు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సురక్షితమైన నీటిని అందించి, మరో రెండు, మూడు రోజులు వైద్య సిబ్బంది రోగులకు చికిత్సలు అందిస్తే అతిసార వ్యాధి అదుపులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

తండాను సందర్శించిన ఫరీదుద్దీన్

సిద్దాపూర్ తండాలో అతిసార వ్యాధి సోకిందన్న సమాచారంతో ఎమ్మెల్సీ ఫరీదొద్దీన్ ఆదివారం తండాను సందర్శించి పాఠశాలలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీలను తిరిగి పరిశీలించారు. సంపూర్ణ పారిశుధ్యానికి అధికారులందరూ కృషి చేయాలని సూచించారు. రోగులకు సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని, క్లోరినేషన్ పౌడర్, మందు బిల్లాలను అందజేయాలని జిల్లా వైద్యాధికారికి ఫోన్ ద్వారా సూచించారు. అతిసార వ్యాధి అదుపులోకి వచ్చేంత వరకు వైద్య సిబ్బంది తండాలో వైద్య శిబిరాన్ని కొనసాగించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్ నిర్వాహణ, లీకేజీలకు మరమ్మతులు చేయించి సురక్షితమైన నీటిని అందించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ రామక్రిష్ణారెడ్డి, మొగుడంపల్లి సొసైటీ డైరెక్టర్ కుత్బొద్దీన్ ఉన్నారు.



తండాలోని లీకైన పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్సీ

వీరి కన్నీటిని ఆపేదెవరు?

• కలెక్టరేట్ సాక్షిగా రైతు ఆత్మహత్య • వారం గడిచినా పరిహారం శూన్యం • రోడ్డున పడిన కుటుంబం

సంగారెడ్డి రూరల్: తమకు సంబంధించిన భూమైనా ఇవ్వండి లేదా పరిహారమైనా ఇప్పించండి అని సంవత్సరాల తరబడి కార్యాలయాలు, అధికారుల చట్టూ తిరిగి తిరిగి వేసారి ఎవరూ పట్టించుకోకపోవడంతో కలత చెంది ఈ నెల 21న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో రైతు వెంకట చలపతిరావు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మృతుడు వ్యవసాయంలో నష్టం రావడంతో చిరు వ్యాపారం చేస్తూ తన తల్లి, భార్య, పిల్లలను పోషించేవాడు. ఇంటి పెద్ద మృత్యువాత పడడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడికి తల్లి శారదాబాయి కురువృద్ధురాలు, భార్య స్వాతి, ఆరు సంవత్సరాల కూతురు కాత్యాయని ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో ఇంటి భారాన్ని మృతుడి భార్య స్వాతిపైనే పడింది. దీంతో ఆ కుటుంబం ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. బాధిత రైతు మృతి చెంది వారం రోజులు గడిచినా బాధితుడిని ఆదుకుంటామని అధికారులు అప్పటి మాత్రానికి హామీ ఇచ్చి ఆయన కుటుంబం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కనీసం ప్రజాప్రతినిధులు ఎవ్వరూ కూడా పరమర్శించేందుకు కూడా వెల్లలేదని బాధితుల బంధువులు తెలిపారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి తమకు ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఉపాధి కల్పించాలని దీనంగా వేడుకుంటున్నారు.



మృతుడు వెంకటచలపతి రావు (ఫైల్)

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

• విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి • న్యాయమూర్తి దుర్గాప్రసాద్

సంగారెడ్డి రూరల్: ఎన్నో పుణ్యాలు చేస్తే మానవ రూపంలో జన్మిస్తామని మంచి పనులు చేసి మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని మియాపూర్ 9వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి దుర్గా ప్రసాద్ అన్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలోని ఓడీఎఫ్ కాలనీలోని రాయల్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కల్గి ఉంటే సులువుగా రాణించవచ్చని పేర్కొన్నారు. దేశ రక్షణకోసం ఎందరో తమ ప్రాణాలు పణంగా పెట్టి త్యాగాలు చేశారని వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు చదువుని ప్రేమిస్తూ స్వతహాగా లక్ష్యాలను ఏర్పర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో పోటీతత్వం పెరిగిపోయిందని, కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, తప్పులు చేయకుండా నీతి నిజాయితీలే తమకు శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జైళ్ల పాలై కోర్టుల చుట్టూ తిరగకూడదని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ కృపానిధి ఫెరిడా మాట్లాడుతూ సమాజంలో మార్పుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం న్యాయమూర్తి దుర్గాప్రసాద్, ఆర్‌ఐవో కిషన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హత్నూర ఎంపీడీవో ప్రమీల, హ్యూమన్ రైట్స్ సభ్యులు అన్వర్‌అలీ, యామిని, కళాశాల సిబ్బంది తేజస్విని, అధ్యాపకులు చండీశ్వర్, కోండయ్య, పరశురాములు, సతీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



అదృశ్యమైన సుమన్

సంగారెడ్డి రూరల్: ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి రాత్రి అయినా ఇంటికి చేరుకోలేదు. సంగారెడ్డి పట్టణ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలం గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన గుండా సుమన్ రెండు సంవత్సరాల క్రితం సంగారెడ్డి పట్టణంలోని రైతు బజార్ పక్కన ఫకీరుద్దిన్ ఇంట్లో పై పోర్షన్‌లో అద్దెకు ఉంటున్నాడు. అదే భవనంలో కింద ఒక మలిగి అద్దెకు తీసుకుని ఆర్‌కే దమాక సేల్ పేరుతో బట్టల వ్యాపారం చేసేవాడు. ఈ నెల 19న సుమన్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి సాయంత్రం ఇంటికి వస్తున్నానని తెలిపాడు. రాత్రి అయినా సుమన్ ఇంటికి చేరుకోలేకపోవడంతో అతని సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో షాపులో పనిచేసే నిజాంకు ఫోన్ చేయగా సాయంత్రం 6 గంటలకు వెళ్లారని తెలిపారు. దీంతో చుట్టూ పక్కల ప్రాంతాల్లో వెతకగా, బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఆరా తీయగా జాడ తెలియరాలేదు. సుమన్ సోదరుడు గుండా నరేష్ ఫిర్యాదు మేరకు సంగారెడ్డి పట్టణ సీఐ రామకృష్ణ రెడ్డి కేసు నమోదు చేసుకుని ఎస్ఐ లక్ష్మారెడ్డికి దర్యాప్తు చేయాలని ఆదేశించారు. సుమన్ ఆచూకి తెలిసిన వారు 9490617010, 7382299515, 08455 276333 నెంబర్లలో సమాచారం ఇవ్వాలన్నారు.

నీటిగుంతలో పడి మహిళ మృతి

చేర్యాల: ఇంటి ఆవరణలోని నీటి గుంతలో పడి ఓ మహిళ మృతిచెందింది. మండలంలోని కడవేరుగు గ్రామానికి చెందిన రాచకొండ లచ్చవ్వ(48) ఆదివారం తెల్లవారుజామున తమ ఇంటి ఆవరణలోని నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. వేకువజామున నిద్రలేచి బయటకు వెళ్తుండగా నీటి గుంతలో పడి ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు.

వివాహిత ఆత్మహత్య

జగదేవ్‌పూర్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన జిల్లా భాను- లక్ష్మి(22) దంపతులు. అయితే, ఇటీవల కుటుంబంలో తరచుగా గొడవలు జరుగుతున్నాయని మనస్తాపం చెందిన లక్ష్మీ పురుగుల మందు తాగింది. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

'క్రీడల్లో గెలుపోటములు సహజం'

సిద్దిపేట మున్సిపాలిటీ: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్ఫూర్తిని చాటాలని సిద్దిపేట జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చరణ్‌దాస్ అన్నారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు.

సినిమాలు

పటాన్‌చెరు
ఎస్‌ఎస్‌వీ — జయ జానకి నాయక
రుక్మిణి — అర్జున్‌రెడ్డి

రామచంద్రాపురం
సంగీత — జయ జానకి నాయక
జ్యోతి — ఫిదా

సదాశివపేట
జ్యోతి — లై
మహేశ్వరి — అర్జున్‌రెడ్డి

బొల్లారం
జ్యోతి — అర్జున్‌రెడ్డి

సంగారెడ్డి
నటరాజ్ — జయ జానకి నాయక
రుక్మిణి — నేనేరాజు నేనే మంత్రి
సితార — అర్జున్‌రెడ్డి

జోగిపేట
శ్రీవెంకటేశ్వర — లై

చురుగ్గా సాగుతున్న మైత్రీ స్టేడియం పనులు

- రూ.4 కోట్ల నిధులతో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు




పటాన్‌చెరులో చురుగ్గా ప్రారంభమైన మినీ స్టేడియం పనులు, నమూనా చిత్రం

పటాన్‌చెరు: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని క్రీడా ప్రియుల చిరకాల మినీ స్టేడియం కోరిక త్వరలో నెరవేరబోతోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చొరవతో పట్టణం నడిబొడ్డున ఉన్న మైత్రీ మైదానంలో అన్ని హంగులతో మినీ స్టేడియం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రూ.4 కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులు మినీ స్టేడియం కోసం మంజూరయ్యాయి. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణమవుతున్న మినీ స్టేడియంలో అన్ని ఆధునిక వసతులు ఉండేలా ప్రణాళిక సిద్ధమైంది. అనేక ఏళ్లుగా స్టేడియం కోసం ఎదురు చూసిన క్రీడాకారుల కల సాకారం కాబోతోంది. ముఖ్యంగా యువత, క్రీడాకారులు స్టేడియం కోసం ఆయా నాయకులపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. చివరకు ఎమ్మెల్యే చొరవతో మినీ స్టేడియం పనులకు ముందడుగు పడింది.

చిన్న స్థలంలో ఆధునిక హంగులతో

పట్టణం మధ్యలో ఉన్న రెండున్నర ఎకరాల స్థలంలో ఇంజనీర్లు, క్రీడానిపుణుల సూచనలు, సలహాల మేరకు స్టేడియం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. మైదానం స్థలం తక్కువ కాకుండా ప్రేక్షకులు కూర్చుండే గ్యాలరీ స్థలాన్ని కుదించారు. సుమారు వెయ్యి మంది ప్రేక్షకులు క్రీడలు వీక్షించేలా గ్యాలరీకి స్థలం కేటాయించారు. ఇక క్రీడా మైదానం మాత్రం క్రీడా ప్రమాణాలకు అనుగుణంగా తగినంత స్థలాన్ని కేటాయించారు. మైదానం మొత్తం గడ్డి ల్యాన్‌తో తీర్చిద్దబోతున్నారు. రాత్రిపూట సైతం ఆడుకునేలా ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో పాటు క్రీడాకారులకు వసతి, ఒక ఆధునికమైన జిమ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. స్టేడియంలో మైదానం చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను సైతం సిద్ధం చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. నిధుల కొరత లేనందున పనులు అనుకున్న సమయంలో పూర్తైతే ఎడాదిన్నరలో అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

ఉన్నత ప్రమాణాలతో నిర్మాణం



మినీ స్టేడియం నిర్మాణం ఉన్నత ప్రమాణాలతో నిర్మించుతున్నాం. స్టేడియం నిర్మాణంలో రాజీ పడకూడదని ఎమ్మెల్యే అదనపు నిధులు సమకూర్చారు. ప్లాన్ సిద్ధం చేస్తున్నప్పుడు స్థానిక సీనియర్ క్రీడాకారుల సూచనలు అడిగారు. మైదానంలో గడ్డిల్యాన్‌తో అత్యంత ఆధునిక స్టేడియం రూపుదిద్దుకుంటోంది.

-హన్మంతరెడ్డి,
మైత్రీ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు

‘గీతం’ విద్యార్థుల పుస్తక వితరణ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న బీటెక్ విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్: హైదరాబాద్‌లోని గీతం విశ్వవిద్యాలయం బీటెక్ విద్యార్థులు రుద్రారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఐటీసీ సీనియర్ మేనేజర్ ఎస్.ఎన్.ఉమాకాంత్ చేతుల మీదుగా వంద మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు పురస్కారాలు ఇచ్చి ఉత్సాహపరిచారు. బీటెక్ నాలుగో ఏడాది విద్యార్థి జి.మణికంఠ నేతృత్వంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఇతర ఉపాధ్యాయులు సమాజహిత కార్యక్రమాన్ని చేస్తున్న గీతం విద్యార్థులను అభినందించారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా నర్సింగ్‌రావు



నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింగ్‌రావు

పటాన్‌చెరు: బీజేపీ పటాన్‌చెరు నియోజకవర్గం కన్వీనర్‌గా నర్సింగ్‌రావును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, జిన్నారం మండలం అండూర్ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం పటాన్‌చెరు పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బుచ్చిరెడ్డి నియోజ కవర్గం ఇన్‌చార్జ్‌గా నర్సింగ్‌రావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో అంకితభావంగా పనిచేస్తున్న నర్సింగ్‌రావు నేతృత్వంలో మంచి ఫలితాలు రావాలన్నారు. నర్సింగ్‌రావు మాట్లాడుతూ శక్తివంచనలేకుండా పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ, నందీశ్వర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.అంజిరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, అంజిబాబు, సహదేవ్, మన్నెరాజు, ఈర్లరాజు, మహేందర్, చంద్రయ్య, రాజనసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ చౌరస్తాలో చెక్‌పోస్టు ఏర్పాటు

హత్నూర: దౌల్తాబాద్ చౌరస్తాలో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై హత్నూర పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నిత్యం వచ్చిపోయే వాహనాలపై నిఘా పెట్టి అనుమానస్పదంగా కనిపించే లారీలను తనిఖీలు చేస్తున్నారు. వినాయక చవితి, బక్రీద్ పండుగలు ఉన్నందున గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇతర ప్రాంతాలకు ఆవులను తరలించే వాహనాలపై కూడా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆవులను తరలించినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా చర్యలు తప్పవని ఎస్ఐ రాజేష్‌నాయక్ అన్నారు.

‘మారుమూల తండాలకు ఉచిత వైద్య సేవలు’

పుల్‌కల్: మారుమూల గిరిజన తండాల ప్రజలకు ఉచిత వైద్య సేవలందించనున్నట్లు ప్రముఖ డాక్టర్ ఆర్.పరశురాంనాయక్ తెలిపారు. భవానీ సేవాలాల్ రామ్‌రావ్ మహారాజ్ యువజన సంఘం అధ్వర్యంలో మంజీర హాస్పిటల్ సౌజన్యంతో బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు కే.గాయత్రి, కే.శివశంకర్‌రెడ్డి, బాలజీ, భీమేశ్వర్, కే.నవీన్, శంకర్‌చౌహాన్ ప్రజలకు పరీక్షలు నిర్వహించి 400 మందికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, సీడీసీ డైరెక్టర్ జైపాల్‌నాయక్, యువజన సంఘం నాయకులు ప్రవీణ్, గణపతి, శివాజీ, దుర్వాస్, ప్రశాంత్, నవీణ్, బాబులాల్, దేవీదాస్, తిలక్, ప్రకాశ్, సుశీల్, నరేందర్, విగ్నేష్, రాకేశ్, సతీష్, వెంకటేశ్, కె.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక

- ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ

రామచంద్రాపురం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలని మెదక్ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు అంజయ్యయాదవ్, వి.సింధూ ఆదర్శరెడ్డి, రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మల్లెపల్లి సోమిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బి.పుష్పనగేష్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పి.అరుణ్‌గౌడ్ అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణం, తెల్లాపూర్‌లోని వివిధ వినాయక మండపాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాడవాడలా కొలువుదీరిన వినాయకుడు

గుమ్మడిదల: గుమ్మడిదలలో శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సిద్ధివినాయక యూత్ అధ్యక్షుడు సీహెచ్ సూర్యనారాయణ సమక్షంలో వార్డు సభ్యులు ఎస్.వాసుదేవరెడ్డి, నవజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.నరేశ్‌కుమార్, మండల యువజన సంఘాల సమితి కోశాధికారి నర్సింగ్‌సాగర్, సభ్యులు కంది రాము, మ్యాకల రవీందర్, ఉదయ్‌కుమార్, మహేశ్, రతన్, కృష్ణ, రాజుపంతులు, చంటి, రాకేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూత్ సభ్యులు మాట్లాడుతూ ఈ రెండు రోజుల్లో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలన్నారు.

‘టీ-జాగృతి’లోకి భారీగా చేరికలు



టీ-జాగృతిలోకి చేరిన విద్యార్థులతో భిక్షపతి స్వామి, డీబీ నాగభూషణం

జోగిపేట: జోగిపేటకు చెందిన ఎన్‌ఎస్‌యూఐకి చెందిన నాగరాజు, ఫైసల్ నేతృత్వంలో వంద మంది విద్యార్థులు ఆదివారం తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన టీ-జాగృతి స్టూడెంట్ ఫోర్స్(టీఎస్‌జేఎఫ్)లో చేరారు. ఎన్‌ఎస్‌యూఐతోపాటు పలు సంస్థలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఉదయం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బైక్‌లతో ప్రభుత్వ అతిథి గృహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీ-జాగృతి రాష్ట్ర కార్యదర్శి, అల్లాదుర్గం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భిక్షపతి స్వామి, జోగిపేట ఏఎంసీ చైర్మన్ నాగభూషణం సమక్షంలో టీ-జాగృతి కండువాలను కప్పుకుని ఆ సంస్థలో చేరారు. భిక్షపతి స్వామి మాట్లాడుతూ బంగారు తెలంగాణ లక్ష్యంగా కవిత చేస్తున్న వినూత్న సేవా కార్యక్రమాల వల్లనే నేడు యువత టీ-జాగృతి పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు.

జిల్లా కోకన్వీనర్‌గా నాగరాజు

టీజేఎస్‌ఎఫ్ జిల్లా కోకన్వీనర్‌గా నాగరాజు, అందోలు నియోజకవర్గ అధ్యక్షుడుగా ఫైసల్, ఉపాధ్యక్షుడుగా జీ.ప్రవీణ్, పట్టణాధ్యక్షుడుగా మారుతిని నియమిస్తున్నట్టు భిక్షపతి ప్రకటించారు.ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నగరపంచాయతీ అధ్యక్షుడు చాపల వెంకటేశం, టీఎస్‌జేఎఫ్ జిల్లా కన్వీనర్ రవి, నాయకులు వినోద్, గణేశ్, నరేశ్, మధు, ఐటీ విభాగం నాయకుడు మల్లేశ్, విద్యార్థి నాయకులు కే.శేఖర్, ఎం. శివకుమార్, సంతోష్, క్రిష్ణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్’లో ప్రవేశాలు ప్రారంభం

జోగిపేట: 2017-18 విద్యా సంవత్సరానికి గానూ సార్వత్రిక విద్యా విధానం (టీఓఎస్‌ఎస్)లో చదివేందుకు ఇంటర్మీడియేట్, పదో తరగతుల్లో చేరేందుకు ప్రవేశాలు ప్రారంభమైనట్టు మండలంలోని నేరడిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. రామానుజం తెలిపారు. అదనపు రుసుము లేకుండా సెప్టెంబర్ 4 వరకు, అదనపు రుసుముతో సెప్టెంబర్ 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు కనీసం 3వ తరగతి చదివినట్టు స్టడీ సర్టిఫికేట్, కుల, నివాస, ధృవపత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో టాస్ (టీవోఎస్‌ఎస్) ఇన్‌చార్జి ప్రభాకర్‌ను 9441762435, 9542253722 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు సింగూరులో ధ్యానయజ్ఞం

- హాజరుకానున్న బాబుమోహన్

పుల్‌కల్: మండలంలోని సింగూరు కల్యాణ సుందర వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధ్యానయజ్ఞం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బాబుమోహన్, ప్రపంచ వ్యాప్త పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రిజీ హాజరవుతున్నారు. ఈ ధ్యానయజ్ఞంలో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి, స్వచ్ఛత, స్వస్థత, సంకల్ప శక్తి, ఆత్మజ్ఞానం, ఆత్మస్థైర్యం, మానసిక స్థైర్యం, మానసిక ప్రశాంతత, గెలుపోటముల మధ్య సమతుల్యం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు మండలంలోని రాయిపాహాడ్ గ్రామ శివారులో పిరమిడ్ ధ్యాన కేంద్ర ఏర్పాటుకు ఎమ్మెల్యే బాబూమోహన్, బ్రహ్మర్షి పత్రిజీ భూమి పూజ నిర్వహించనున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

జిన్నారం: మండల కేంద్రం జిన్నారంలో పులిగిల్లా ఫౌండేషన్ తరపున ఓ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఆనారోగ్యంతో మరణించిన కాశ వెంకటేశం కుటుంబానికి పులిగిల్లా ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రకాశంచారి 5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వకర్మ సంఘం కన్వీనర్ భరత్‌చారి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ పాఠశాలకు వంటగది లేదు

• ఇంటి దగ్గరే వండి తెస్తున్న నిర్వాహకులు • వేళకు భోజనం అందక విద్యార్థుల అవస్థలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి నేతాజీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంటి భోజనమే దిక్కైంది. పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం వంట గదులు లేకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 34 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఓ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. 2005లో పాఠశాల తరగతుల కోసం రెండు గదులు, వరండా నిర్మించారు. ఉన్న రెండు గదుల్లోనే విద్యార్థులు విద్యనభ్యసించడం, అదే గదుల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సామగ్రి, బియ్యం భద్రపరుస్తున్నారు. పాఠశాలలో వంటగది కోసం స్థలం లేకపోవడంతో నిర్వాహకులు ఇంటి వద్దే మధ్యాహ్న భోజనం వండి కొని పాఠశాలకు తీసుకువస్తున్నారు. దీంతో సమయానికి విద్యార్థులకు భోజనం అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలోనే వంట గది నిర్మాణం చేపట్టాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంటగది నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సంగారెడ్డి నేతాజీనగర్‌లో వంటగది లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

బీజేపీలో చేరిన ఫసల్‌వాది గ్రామస్థులు



బుచ్చిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

సంగారెడ్డి అర్బన్: ఫసల్‌వాది గ్రామానికి చెందిన వంద మంది టీఆర్ఎస్ నాయకులు జిల్లా అధ్యక్షుడు కాసాల బుచ్చిరెడ్డి సమక్షంలో ఆదివారం బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై బీజేపీలో భారీగా కార్యకర్తలు చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోచారం రాములు, నాయకులు విష్ణువర్ధన్, సురేందర్, వాసు, రమేశ్, నాయకులు కె.రమేశ్, బాబు, మహేశ్, నందు, సతీష్, నాగరాజు, లక్ష్మణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీ, ప్రజావాణి

సంగారెడ్డి రూరల్: జిల్లాలోని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఎస్పీ (9440901824) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు అందుబాటులో ఉండి గ్రీవెన్స్‌ను నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజావాణి

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్ తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల ద్వారా అందజేయాలని సూచించారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

సంగారెడ్డి టౌన్: నేడు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్యన డయల్ యువర్ మున్సిపల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి తెలిపారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్ ద్వారా తమకు తెలియజేస్తే తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

'జాక్టో ర్యాలీని జయప్రదం చేయండి'

సంగారెడ్డి రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల స్వామి పిలుపునిచ్చారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాలను సమర్పించాలని సంయుక్త కార్యాచరణ సమితి జాక్టో నిర్ణయించిందన్నారు.

నేడు అఖిలపక్ష ర్యాలీ

సంగారెడ్డి అర్బన్: జిల్లా కేంద్ర ఆస్పత్రికి అనుబంధంగా మెడికల్ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న టీజేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్షాల సమన్వయంతో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ బీరయ్యయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ జిల్లా ప్రజల సంక్షేమం కోసం మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈపీఎఫ్‌పై రేపు అవగాహన సదస్సు

సంగారెడ్డి అర్బన్: వివేకానంద ఇన్‌స్టిట్యూట్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ (వికాస్), బీఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఈపీఎఫ్, భవిష్యనిధిపై జిల్లా కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు పి.మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సామాజిక సేవల్లో యువత ముందుండాలి

• మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సదాశివపేట: ప్రజల్లో ఐక్యత భావం పెంచే సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ నీడీ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియ వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. రక్తదానాన్ని చిన్న దానంగా చూడొద్దని అది మరొకరి ప్రాణాలను నిలుపుతుందన్నారు. ప్రపంచంలో తయారు చేయలేనిది ఒక్క రక్తమేనన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ నీడీ హార్ట్ ఫౌండేషన్ చిన్న పిల్లల కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసించదగ్గవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బోడపల్లి అవనీష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ బి.అరుణ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు రవికిరణ్‌గౌడ్, సాయిరాం, శ్రీకాంత్, లడ్డు, మాజీద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన యువకులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జగ్గారెడ్డి

నేడు పశువుల మార్కెట్‌ను ప్రారంభించనున్న మంత్రి

• మార్కెట్ కమిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్: పాడి రైతుల సౌకర్యార్థం ఫసల్‌వాది చౌరస్తాలో నిర్మించిన పశువుల మార్కెట్ యార్డుని ఈ నెల 28న మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుని మూడెకరాల స్థలంలో రూ.75 లక్షల నిధులతో అధునాతన హంగులతో అన్ని సౌకర్యాలతో నిర్మించామని తెలిపారు. పశువుల సంత లేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఇబ్బందులను దూరం చేసేందుకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ వహించి మార్కెట్ యార్డు నిర్మాణానికి సహాయసహకారాలు అందించారన్నారు. త్వరలో రైతులకు రూ.5 భోజనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీడీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, జడ్పీటీసీ మనోహర్‌గౌడ్, టీఆర్ఎస్ పట్టణ, సంగారెడ్డి, కంది మండలాల అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, అశోక్, చిల్వేరి ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు శ్రావణ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఎంపీటీసీ చక్రపాణి, జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్‌నాయక్, యూవర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ప్రశ్నించే గొంతుకలు ఏకమవ్వాలి

• మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సంగారెడ్డి రూరల్: ప్రశ్నించే గొంతుకలు ఏకం కావాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఆదివారం నిర్వహించిన ఎన్‌పీఆర్డీ రాష్ట్ర మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో 98 శాతం వికలాంగులు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నారని, దేశంలో 2.50 కోట్లు, రాష్ట్రంలో 10.50 లక్షల మంది వికలాంగులు ఉన్నారని వీరంతా ఏకమై పోరాడి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. దేశంలో ఇప్పటికే 40 శాతం జనాభాకు అక్షర జ్ఞానం లేదని, విద్యా, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు తాము అండగా ఉండి పోరాడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ ఆలిండియా ఉపాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహా, ప్రధాన కార్యదర్శి అడివయ్య, ఐద్వా ఆలిండియా నాయకురాలు జ్యోతి, నాయకులు మాణిక్యం, యాదగిరి, సాయిలు, అశోక్, దత్తు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

సంగారెడ్డి అర్బన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని శాంతినగర్ ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో 30 సంవత్సరాలుగా సేవలు చేయించుకుని వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. సెప్టెంబర్ 1న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవయ్య, కార్యదర్శి గోవిందరెడ్డి, నాసర్‌పటేల్, సోమశేఖర్, విజయభాస్కర్, జీవన్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బట్టలుతికి వినూత్న నిరసన



సిద్ధాపూర్ కాలనీకి వెళ్లే రోడ్డుపై బట్టలుతుకుతున్ననాయకులు

సదాశివపేట: పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడ్డ గోతుల్లో నిలిచిన వర్షపు నీటిలో ఆదివారం సీపీఐ పార్టీ నాయకులు బట్టలుతికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తాజోద్దీన్ మాట్లాడుతూ పట్టణంలోని 4, 12 వార్డులతో పాటు హౌజింగ్‌బోర్డు కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే ఈ రోడ్డు దుస్థితి గురించి పట్టించుకోవాల్సిన మున్సిపల్ చైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకుని రోడ్డుపై మరమ్మతులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నా యకులు ఇన్నాష్, సిద్ధాపూర్ కాలనీ అధ్యక్షులు రఫియోద్దీన్, రవి, అంజయ్య, అశోక్, రాములు, అప్జల్ పాల్గొన్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సంగారెడ్డి రూరల్: పోతిరెడ్డిపల్లి గ్రామంలోని విద్యానగర్‌లోని వినాయక మండపంలో ఆదివారం వినాయకుడికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యానగర్‌లో రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, జడ్పీటీసీ మనోహర్‌గౌడ్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సంగారెడ్డి, కంది మండలాల అధ్యక్షుడు అశోక్, చిల్వేరి ప్రభాకర్, ఎంపీటీసీ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్‌కు అవగాహన సదస్సు

సంగారెడ్డి అర్బన్: ప్రపంచ ఫొటోగ్రాఫి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సంగారెడ్డిలోని పాత బస్టాండ్ బాలాజీ స్టూడియోలో జేవీసీ కొత్త కంపెనీ కెమెరాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండాపురం జగన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జనార్దన్, అహ్మద్, కార్యదర్శులు రాజేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ సినిమాలు

షెట్కార్‌సువర్ణ	వివేకం
వెంకటేశ్వర	నేనే రాజు.. నేనే మంత్రి

పెద్దశంకరంపేట

లక్ష్మి	జయ జానకి నాయక

హరితహారంలో ఆదర్శం మాయికోడ్ పాఠశాల

• పచ్చదనంతో అహ్లాదకరంగా ఆవరణ

•పూలు,కూరగాయలు పెంపకం

మనూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మొక్కల పెంపకానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తుంది. మూడో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. మనూరు మండలం మాయికోడ్‌లో ప్రభుత్వ పాఠశాలలో హరితహారంలో మొక్కలు నాటి వాటిని రక్షించడంలో ఆదర్శంగా నిలుస్తుంది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రూ.3వేల చొప్పున జమ చేసి రూ.30 వేలతో పాఠశాల చుట్టు పెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో మొత్తం 310 మొక్కలు కానుగా, అడవిబాదం, టేకు, అల్లనేరేడు, జామ, మామిడి, సుబాబుల్, మిర్చి, రావి, ఉసిరి చెట్ల పెంపకం చేస్తున్నారు. వీటితో పాటు వివిధ రకాల పూల తోట , ఆకుకూరలు, బెండ, సోర, బీర, చిక్కుడు, టమాటా వంటి కూరగాయలు పండిస్తున్నారు. నాటిన మొక్కలు కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం, ఖాళీ సమయంలో మొక్కల సంరక్షణకు కలిసికట్టుగా పని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ పండించిన కూరగాయలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంకు వంటలు చేయడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటున్నారు. హరితహారంలో ప్రతి మొక్కకు ఈ పాఠశాలను ఆదర్శంగా తీసుకొని నాటిన మొక్కలను కాపాడుకుంటే రాష్ట్రం మొత్తం పచదనంతో సస్యశ్యామలంగా ఉంటుందని చెప్పవచ్చు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జీవన్‌రాథోడ్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పాఠశాల వద్ద మొక్కలను పెంచడం చాలా ఆనందంగా ఉందని, సిబ్బందితో కలసి ఈ మొక్కలను కాపాడుకుంటున్నామన్నారు.



పచ్చని మొక్కలతో మాయికోడ్ పాఠశాల



మొక్కలకు నీరు పోస్తున్న ఉపాధ్యాయుడు

చెప్పడం కాదు చేయడంలో ఆనందం

- రాజు, ఉపాధ్యాయుడు మాయికోడ్



హరితహారంలో నాటిన మొక్కలు కాపాడుకోవాలని చెప్పడం కాదు పని చేసి మొక్కలను పెంచడంలో ఆనందం ఉందని ఉపాధ్యాయుడు రాజు అన్నారు. తమ పాఠశాల వద్ద 310 వివిధ రకాల మొక్కలను నాటి పెంచడంతో అవి పెరిగి నీడను ఇస్తున్నాయని, వీటిని చూసి తాము తమ సిబ్బంది ఎంతో ఆనంద పడుతున్నామన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన ‘ఖేడ్’ వాగ్దేవి విద్యార్థులు



పావని



మానసరెడ్డి

నారాయణఖేడ్ : జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలకు తమ కళాశాలలో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించిన ఇరువురు విద్యార్థినులు ఎంపికయ్యారని స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి , కరస్పాండెంట్ కొండల్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఇటీవల ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు తమ కళాశాలలో చదువుకున్న బెల్లాపూర్‌కు చెందిన పావని ఎంపీసీలో 982 సాధించిందని, కడ్పల్‌కు చెందిన మానసరెడ్డి ఎంపీసీ ఆంగ్ల మాధ్యమంలో 981 మార్కులు సాధించిందన్నారు. ఈ ఇరువురిని ప్రతిభా పురస్కారాలకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, వీరికి ఒక్కొక్కరికి ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు రూ.80 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, రవికుమార్‌లు అభినందించారు.

రేపు ఖేడ్‌లో మెగా జాబ్ మేళా : ఎమ్మెల్యే

నారాయణఖేడ్ : నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు టాటా కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణఖేడ్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని నిరుద్యోగ యువత కోసం సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి , ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్ చదివిన వారు తమ బయోడేటాతో జాబ్ వేళాకు హాజరు కావాలన్నారు.

కేసీఆర్‌కు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి

• గణపయ్యకు వినతి పత్రం సమర్పించిన డీఎస్సీ అభ్యర్థులు

కల్హేర్ : ఇదిగో డీఎస్సీ, అదిగో డీఎస్సీ అంటూ మూడేళ్లుగా కాలయాపన చూస్తు నిరుద్యోగులను మభ్యపెడుతున్న సీఎం కేసీఆర్‌కు మంచి బుద్ధి ప్రసాదించి , కొత్త జిల్లాల ప్రకారం డీఎస్పీ నిర్వహించే విధంగా చూడూ స్వామి అంటూ మండల పరిధిలోని బీబీపేటలో డీఎస్సీ అభ్యర్థులు వినూత్నంగా గణపతికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపిన సంఘటన ఆదివారం జరిగింది. బీబీపేటలో ప్రతిష్టించిన వినాయకుడికి నూతన జిల్లాల డీఎస్పీ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్న అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. జరీసంతోష్, పండరి,నాగరాజు, నవీన్‌రెడ్డి, వినోద్, నవీన్ పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులతో రాకపోకలు

సిర్గాపూర్ : కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన కాంట్రాక్టర్ ఆదివారం డైవర్షన్ పనులు చేపట్టారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వంతెన డైవర్షన్ పూర్తిగా కొట్టుకొని పోయి రాకపోకలు నిలిచిన పోయిన సంగతి విధితమే. ఈ కథనాన్ని పలు మార్లు ఆంధ్రజ్యోతిలో ప్రచురించింది. దీనికి స్పందించిన స్థానిక కాంట్రాక్టర్ ఆదివారం తాత్కాలిక డైవర్షన్ పనులు చేపట్టడంతో రాకపోకలు సాగుతున్నాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెడ్ల సంక్షేమానికి సమష్టి పోరాటం

కంగ్టి : అన్ని రంగాలలో వెనుక బాటు తనానికి గురవుతున్న రెడ్డిల సంక్షేమం కోసం సమష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కర్ణాటకలోని బీదర్ జిల్లా హేమారెడ్డి మల్లమ్మ సంఘం అధ్యక్షులు విజయ్‌రెడ్డి, ఖేడ్ తాలూకా కన్వీనర్ సంగారెడ్డిలు అన్నారు. రాంచందర్‌రెడ్డి, గద్దె ఈర్‌రెడ్డి, మధుసూదన్, గంగారెడ్డి, ఉమాకాంత్, బాబు, శేకర్, గోవింద్, వెంకట్, అశోక్, గుండ్, కిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి, సగారెడ్డి, జైపాల్, కరంజి పాల్గొన్నారు.

రాకపోకలను పునరుద్ధరించాలి

కల్హేర్ : కల్హేర్, మాసాన్‌పల్లి గ్రామాల మధ్య రాకపోకలు పునరుద్దరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కురిసిన భారీ వర్షాలకు మాసాన్‌పల్లి వాగు వద్ద డైవర్షన్ రోడ్డు కొట్టుకు పోవడంతో 161వ జాతీయ రహదారితో సంబంధాలు తెగి పోయాయి. వాగులో నీరు తగ్గగానే రోడ్డును బాగు చేస్తామని ఏఈ రాము తెలిపారు.

ఖేడ్‌లో కురిసిన భారీ వర్షం

నారాయణఖేడ్ : నారాయణఖేడ్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారు జాము వరకు కూడా ఒక మోస్తారుగా వర్షం కురియడంతో వాగులు వంకల్లోకి వరద నీరు చేరింది. ఈ ప్రాంతంలోని చెరువులు కుంటలు నిండడంతో జలకళ వచ్చింది. ఈ సంవత్సరం ప్రారంభంలో భారీ వర్షాలు కురిసినప్పటికీ జూలైలో వర్షాల జాడ లేక పోవడంతో పెసర, మినుము, కంది, పంటల ఎదుగుదలకు నష్టం వచ్చింది. అయినప్పటికీ పంటలు పండుతున్నాయని రైతులు ఆనందంగా ఉన్న సమయంలో ప్రస్తుతం గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పెసర పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు. భారీ వర్షాల వల్ల పంట పొలాల్లోకి కూడా వరద నీరు చేరుతుండడంతో మొలకలు చెడి పోతున్నాయని రైతులు అన్నారు. నల్లవాగు ప్రాజెక్టు అలుగు కూడా పారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టుభూమి పూర్తి స్థాయిలో సాగులోకి రానుంది.



పత్తి పొలంలోకి చేరిన వరద నీరు

నారాయణఖేడ్ ప్రాంతంలో ఆదివారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్‌లో 20 మి.మీ, కల్హేర్ 1.4 మి.మీ , సర్గాపూర్‌లో 1.4 మి.మీ , నాగల్‌గిద్దలో 22.2 మి.మీ , మనూరులో 22.2 మి.మీ , కంగ్టిలో 19.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

సీసీ కెమెరాలతో ముమ్మరంగా నిఘా

నారాయణఖేడ్ : సీసీ కెమెరాలతో ముమ్మరంగా నిఘా ఉంటుందని స్థానిక డీఎస్పీ యాదగిరి రాజు అన్నారు. ఆదివారం పట్టణంలో సీసీ కెమెరాల పని తీరును ఆయన పరిశీలించారు. పట్టణంలో ఇప్పటికే కూరగాయల మార్కెట్ , బ్యాంక్ వీధి, మదీన కాంప్లెక్స్, సత్తార్ మార్కెట్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని దీనికి తోడు రాజీవ్ చౌక్, బసవేశ్వర చౌక్‌ల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేశారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. పట్టణంలోని ప్రజల కదలికలు కొత్త వారి రాకలను కూడా గుర్తించ వచ్చాన్నారు. అందువల్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరు సహకరించాలన్నారు. పొట్టి శ్రీరాములు చౌక్‌తో పాటు శివాజీ చౌక్‌ల వద్ద కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ నరేందర్ ఉన్నారు.



సీసీ కెమెరాల పని తీరును పరిశీలిస్తున్న డీఎస్పీ యాదగిరి రాజు

ఐకేపీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

సిర్గాపూర్ : మండల పరిధిలోని పోచాపూర్‌లో ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో గ్రామసంఘాల సభ్యులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి సభ్యురాలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీటీసీ క్రిష్ణమూర్తి , ఐకేపీ సిబ్బంది వారికి సూచించారు.

‘ రహదారులపై సామగ్రి ఉంచరాదు ’

నారాయణఖేడ్ : పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు రహదారులపై సామగ్రిని ఉంచరాదని ఎస్ఐ నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజీవ్ చౌక్ నుంచి బసవేశ్వర్ చౌక్ , రాజీవ్ చౌక్ నుంచి మంగల్‌పేట్ రూట్‌తో పాటు ప్రధాన కూడళ్లలో వ్యాపారులు సామగ్రిని రోడ్లపై ఉంచుతున్నారన్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బంది ఎదురవుతుందన్నారు. వ్యాపారులు సామగ్రిని రోడ్లపై ఉంచితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు .వ్యాపారులు తమకు సహకరించాలని ఆయన సూచించారు.

డబుల్ బెడ్‌రూం దరఖాస్తుల స్వీకరణ

నారాయణఖేడ్ : నారాయణఖేడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో ఆదివారం ఆర్ఐ నారాయణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి డబుల్ బెడ్‌రూం గృహాల దరఖాస్తులను స్వీకరించారు. చాంద్‌కాన్‌పల్లి నుంచి గతంలో 54 దరఖాస్తులు వచ్చినప్పటికీ తాజాగా మరో 10 దరఖాస్తులు కూడా వచ్చాయని ఆర్ఐ తెలిపారు.వీఆర్వో అంజయ్య ఉన్నారు.

బహిరంగ మల విసర్జన నిర్మూలించాలి

కల్హేర్ : ప్రతి గ్రామం, తండాలు బహిరంగ మల విసర్జన రహితంగా మారిపోవాలని , దీనికి ప్రతి ఒక్కరూ కృషి కల్హేర్ ఎంపీపీ జమునాబాయి కోరారు. ఆదివారం మండల పరిధిలోని మార్డి గిరిజన తండాలో మరుగుదొడ్ల నిర్మాణం, అవశ్యకతపై తండా వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకుడు రాంసింగ్, ఈజీఎస్ ఎఫ్‌ఏ సాయిలు పాల్గొన్నారు.

జహీరాబాద్ సినిమాలు

మోహన్	ఫిదా
సినీమ్యాక్స్	వివేకం
అనురాగ్	జయ జానకి నాయక

ఆంధ్రజ్యోతి జహీరాబాద్
సంగారెడ్డి • సోమవారం 28 ఆగస్టు 2017
జహీరాబాద్ । మొగుడంపల్లి । ఝరాసంగం । కోహీర్ । న్యాల్‌కల్ । రాయికోడ్

గార్డెన్ దొర సేవలు అమోఘం

• మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంత పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని గార్డెన్‌దొర విద్యాభివృద్ధికి చేసిన సేవలు అమోఘమని మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. గార్డెన్‌దొర వర్ధంతిని పురస్కరించుకుని అల్లీపూర్‌లోని ఎంఆర్‌హెచ్‌ఎస్ మైదానంలో వైఎంసీఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వివిధ ఆటల పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం రాత్రి బహుమతులను అందజేశారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో 8జట్లు పాల్గొనగా ఫైనల్‌లో జహీరాబాద్ గార్డెన్ క్లబ్, బీదర్ క్లబ్‌ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో బీదర్ క్లబ్ గెలుపొందింది. అలాగే వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో గెలుపొందిన జట్లకు నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ అధ్యక్షుడు షరీన్‌జాన్, ప్రధాన కార్యదర్శి అనంత నవీన్‌కుమార్, బుచ్చిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, డీఎస్ సంజీవ రావు, పాస్టర్లు సునీల్, వై.రవి, మర్పల్లి రమేష్, అంబ్లిక్, ప్రమోద్‌కుమార్, సందీప్‌జాన్, క్రికెట్ కోచ్ సంపత్‌కుమార్, జార్జిపాల్, నవనీత్, ప్రసాద్ పాల్గొన్నారు.

'బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తా'

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టపరుస్తానన్నారు. పార్టీని పటిష్టపర్చేందుకు వీలుగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు కూడా పార్టీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదిలా ఉండగా జహీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా నియమితులైన శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో బీజేపీ జిల్లా మహిళ మోర్చ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ మోర్చ కార్యదర్శి గోదావరిఅంజిరెడ్డి, జిల్లా మహిళ ఇన్‌చార్జి సరళ, జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు అరుణకౌలాస్, జిల్లా ఎస్టీ మోర్చ అధ్యక్షురాలు కల్యాణి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌యాదవ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పూలసంతోష్, నాయకులు సుధీర్‌బండారి పాల్గొన్నారు.

18గ్రామాల్లో రెవెన్యూ సర్వే పూర్తి

కోహీర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని 20 పంచాయతీలకు గాను 18 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కేవలం కోహీర్, బిలాల్‌పూర్ గ్రామాలు మిగిలి ఉన్నాయన్నారు. త్వరలోనే ఈ గ్రామాలలో కూడా రెవెన్యూ సర్వే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను ఇరుగ్రామాల ప్రజలు సర్వే నిర్వహించే సమయంలో రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

న్యాల్‌కల్: ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని రాష్ట్ర బీజేపీ మహిళ మోర్చ ప్రధాన కార్యదర్శి గోదావరిఅంజిరెడ్డి అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. సంగారెడ్డి జిల్లా మహిళ మోర్చ ఇన్‌చార్జి సరళ, జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు అరుణకులాస్, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు అశోక్‌పాటిల్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, విశ్వనాథ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

రాయికోడ్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా యువజన సంఘాల ఉపాధ్యక్షుడు ఇందూరిక్రిష్ణ అన్నారు. ఆదివారం రాయికోడ్‌లో పలు యువజన సంఘాల సభ్యులకు ఉత్సవాల నిర్వాహణపై మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు మండపాల వద్ద ఎప్పుడు ఉండాలన్నారు. విద్యుత్, పోలీస్ అధికారుల సూచనలను, సలహాలను పాటించాలని ఆయన సూచించారు. నిమజ్జన ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. మండపాల వద్ద భజనలు, కీర్తనలతో కాలక్షేపం చేయాలన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నత్తనడకన హరితహారం

• మొక్కుబడిగా కొనసాగుతున్న మొక్కలు నాటే కార్యక్రమం

కోహీర్: మండలంలోని ఆయా గ్రామాలలో హరిత హారం కార్యక్రమం నత్తనడకన కొనసాగడమే కాకుండా అక్కడక్కడ కేవలం మొక్కుబడిగానే పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం బాగున్నప్పటికీ అధికారుల పనితీరు బాగాలేకపోవడం వల్ల మందకోడిగా పనులు జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో 40వేల మొక్కలు నాటాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఏ ఒక్క గ్రామంలో 20వేల మొక్కలు కూడా నాటలేదంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో, ప్రభుత్వ భూముల్లో, ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటాలని సూచించినప్పటికీ ఏ ఒక్క ప్రాంతంలో కూడా పనులు జరుగుతున్న దాఖలాలే కనిపించడం లేదు. నర్సరీల నుంచి తీసుకెళ్లిన మొక్కలు నాటారో లేదో కాని ఎక్కడపడితే అక్కడ వృథాగా మొక్కలను పడవేసిన దాఖలాలు ఉన్నాయి. మండలం మొత్తం 8లక్షల మొక్కలు నాటాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా హరితహారం కార్యక్రమం మారింది. అధికారులందరు చొరవ తీసుకుని ఆచరణతో హరితహారం పనులు కొనసాగిస్తేనే ఈ కార్యక్రమం విజయవంతం కానుంది



వృథాగా పడేసిన మొక్కలు



ఎండిపోతున్న మొక్కలు

అధికారులు చొరవ చూపడం లేదు

-మొగులయ్య, బీజేపీ నాయకుడు, నాగిరెడ్డిపల్లి



హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికి అధికారుల పనితీరు సరిగ్గా లేకపోవడంతో హరితహారం విజయవంతం కావడం లేదు. మొక్కుబడిగా నాటిన మొక్కలకు కూడా నిర్వహణ సరిగ్గా లేని కారణంగా ఎండిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మేకలు, పశువులు తిని వేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతుంది.

పూజలందుకుంటున్న గణనాథులు

జహీరాబాద్: జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలతో పాటు పట్టణాల్లో ప్రతిష్టించిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పురోహితులు ఆయా మండపాల వద్ద వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు వినాయక మండపాల వద్ద ప్రతి రోజు సాయంత్రం అన్నదాన కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, 16వ వార్డులో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జహీరాబాద్ డీఎస్పీ నల్లమలరవితో పాటు బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోదావరి, జిల్లా అధ్యక్షురాలు అరుణకౌలాస్, అర్చనశారడా, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్‌సుభాష్, నారాయణరెడ్డి, మీడియా ఇన్‌చార్జి మాజిద్, యూనుస్, ఉత్సవ కమిటీ సభ్యులు నర్సింలు, రాజేష్ కుమార్, సంతోష్, జీవన్, బస్వరాజ్, నాగేందర్, వినోద్, వేణు, ధన్‌రాజ్, మనీష్, పవన్, బాలాజీ, సచిన్, ఓంకార్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నవరాత్రుల్లో వినాయకులను భక్తిశ్రద్ధలతో పూజించినట్లయితే కోరిన కోరికలు తీరుతాయన్నారు. అలాగే పట్టణంలోని ఎన్‌జీవోఎస్ కాలనీలో గల క్రిష్ణవేణి పాఠశాలలో ప్రతిష్టించిన వినాయకుడికి ఆదివారం ప్రిన్సిపాల్ వశిష్టరెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



ఝరాసంగంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయికోడ్‌లో

మండల కేంద్రమైన రాయికోడ్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్టించిన వినాయకులకు ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. రాయికోడ్‌లోని భూంగొండేశ్వర ఆలయం వద్ద ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుకారాం, కమిటీ సభ్యులు అశోక్, బాలప్ప, మల్లప్ప, ఎల్లయ్య, నర్సింలు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు విశేష పూజలు

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణనాథులను ప్రతిష్టించారు. ఆదివారం ఆయా గ్రామాలలోని మండపాల వద్ద ప్రజలు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి సమయాలలో మండపాల వద్ద ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు రాత్రి సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నారు.మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

దత్తగిరి ఆశ్రమ ఆవరణలో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ఝరాసంగం: మండల పరిధిలోని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో గల ధ్యానమందిరం వద్ద ఆదివారం రాష్ట్ర బీజేపీ మహిళ మోర్చ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. మోదీ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియపర్చాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం దత్తగిరి ఆశ్రమంలోని నవగ్రహాలకు ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి ఆమెతో ప్రత్యేక పూజలను చేయించారు. అనంతరం శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చ ఇన్‌చార్జి సరళ, జిల్లా మమిళ మోర్చ అధ్యక్షురాలు అరుణకౌలాస్, జిల్లా బీజేపీ కిసాన్ మోర్చ అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, బీజేపీ నాయకులు కల్యాణి, పుణ్యవతి పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న బీజేపీ నాయకులు

దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని దత్తగిరి ఆశ్రమంలో ఆదివారం రాష్ట్ర టీఆర్‌ఎస్ నేత దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమంలో నవగ్రహాలకు, పంచవృక్షాలకు ఆయనచే ఆశ్రమ అర్చకులు పూజలు చేయించారు. ఆశ్రమంలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహారాజ్ శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పెద్దాపూర్‌కు..
దారేది?

- ఫ్లైఓవర్ నిర్మించారు.. రోడ్డు మరిచారు • అసంపూర్తిగా సర్వీస్‌రోడ్డు
- చెరువును తలపిస్తున్న బాట • ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



పెద్దాపూర్ గ్రామంలోకి వెళ్లే సర్వీసు రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

సదాశివపేట రూరల్ : సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామ ప్రజలకు 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు శాపంగా మారాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి చౌరస్తా నుంచి మహారాష్ట్రలోని షోలాపూర్ వరకు 65వ నంబర్ జాతీయ రహదారిని నాలుగు లైన్‌ల రోడ్డుగా తీర్చిదిద్దే పనులు చేపట్టిన పేరొందిన ఓ సంస్థ నిర్లక్ష్యం కారణంగా పెద్దాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఫలితంగా గ్రామంలోకి రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సదరు సంస్థ పెద్దాపూర్ వద్ద ఓ భారీ ఫ్లైఓవర్‌ను నిర్మించింది. నిబంధనల మేరకు ఆ సంస్థ పెద్దాపూర్‌కు వెళ్లేందుకు కొత్తగా సర్వీస్ రోడ్డును నిర్మించాలి.

రోడ్డు నిర్మాణానికి అడ్డుగా మారిన శ్మశాన వాటిక

పెద్దాపూర్ గ్రామాన్ని ఆనుకుని జాతీయ రహదారి పక్కనే ఓ వర్గానికి చెందిన శ్మశాన వాటిక ఉంది. దాంతో ఆ వర్గానికి చెందిన కొందరు శ్మశాన వాటికను తొలగించ వద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సదరు సంస్థ సర్వీస్‌రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేసింది. స్థానికులు ఇబ్బందులుపడాల్సి వస్తోంది.

చెరువును తలపిస్తున్న రోడ్డు

రెండేళ్లుగా సాగుతున్న 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల పెద్దాపూర్ ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. ముఖ్యంగా గ్రామం మీదుగా నిర్మించిన ఫ్లైఓవర్ పక్కన సర్వీస్‌రోడ్డు నిర్మించకపోవడంతో నిత్యం గ్రామ ప్రజలు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ధ్వంసమై ఉన్న పాత రోడ్డుపై ప్రయాణం సాగించలేక నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గోతులమయమైన సర్వీస్‌రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు రోడ్డును చెరువులా మార్చేసింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్న గ్రామ సర్వీస్‌రోడ్డు నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని పెద్దాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.

ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం

గ్రామంలోకి వెళ్లే సర్వీస్‌రోడ్డును సకాలంలో పూర్తి చేయాలని ఇది వరకే సంగారెడ్డి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం. ఏళ్లు గడుస్తున్నా అధికారులెవరూ స్పందించడం లేదు.

- రాధేశ్యాంరావు, పెద్దాపూర్, సర్పంచ్

నానా కష్టాలు పడుతున్నాం



గ్రామం వద్ద పూర్తిగా పాడైనా సర్వీస్ రోడ్డుపై ప్రయాణం సాగించలేక నానా కష్టాలు పడుతున్నాం. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యార్థులు చాలా దూరం నడవాల్సి వస్తోంది. త్వరలో సర్వీస్‌రోడ్డు పనులు ప్రారంభించకపోతే బీజేపీ తరఫున ఉద్యమిస్తాం.

- సత్యనారాయణగౌడ్, బీజేపీ నాయకుడు

నేత్రదానంతో.. మరణించినా మరో జీవితంలో వెలుగు నింపొచ్చు. చూపులేని వారికి ఈ లోకాన్ని చూసే అవకాశాన్ని కల్పించొచ్చు. దీనిపై జనాల్లో ఎన్నో అపోహలున్నాయి. అందుకే ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరం. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపుతున్నాయి. చనిపోయిన వారి కళ్లను కుటుంబీకులు దానం చేసేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. లయన్స్‌క్లబ్ సభ్యులు ఇందుకు ఎంతో కృషి చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అందరూ నేత్రదానానికి సహకరించేలా చేస్తున్నారు. ఒక మంచి పని కోసం క్లబ్ సభ్యులు చేసే కృషి నిజంగా అభినందనీయమే.



- నేత్రదానంతో మరో జన్మ
- చనిపోయినా లోకాన్నిచూసే అవకాశం
- అంధుల చీకటి జీవితాల్లో వెలుగులు నింపడానికి దోహదం
- అంధత్వ నివారణలో లయన్స్‌క్లబ్ కృషి అభినందనీయం
- కొనసాగుతున్న నేత్రదాన పక్షోత్సవాలు



నేత్రాలు సేకరిస్తున్న లయన్స్‌క్లబ్ వైద్యులు

మరణించినా..
మరో జీవితానికి వెలుగు



చేర్యాల : సర్వేంద్రియానాం నయనం ప్రధానం. శరీరంలోని అన్ని అవయవాల్లో కన్నా కళ్లు ఎంతో ముఖ్యమైనవి. అలాగే నేడు అన్నిదానాల్లో కన్నా నేత్రదానం మిన్న. లోకంపోకడలతో పాటు జీవితాంతం మనకు ప్రపంచాన్ని చూపించే కళ్లను, మనం మరణించిన తరువాత శరీరంతో పాటే కాల్చకుండా, పూడ్చకుండా అంధులకు ప్రసాదిస్తే వారికి కంటిచూపు వస్తుంది. తద్వారా మనం మరణించినా మరొకరికి లోకాన్ని చూపించే భాగ్యం కలుగుతుంది. చీకటి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్న దిశగా స్వచ్ఛందసంస్థలు నేత్రదానంపై విస్తృత ప్రచారం చేస్తున్నాయి. దీంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రేరణ పొందిన చాలామంది నేత్రదానంపై సముఖత వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ 1986 ఆగస్టు 25వ తేదీన మొట్టమొదటిసారిగా నేత్రదాన వాగ్ధానం చేశారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత శుక్రవారం నుంచి ప్రారంభమైన పక్షోత్సవాలు సెప్టెంబర్ 5వ తేదీవరకు కొనసాగనున్నాయి.

అంధత్వ నివారణకు లయన్స్‌క్లబ్ ప్రత్యేక చొరవ

నేత్రదానంపై స్వచ్ఛంద సంఘాలు చూపిస్తున్న చొరవ అంతా ఇంతాకాదు. ఇందులో లయన్స్‌క్లబ్ సభ్యులు ముందున్నారు. అంధత్వ నివారణే ధ్యేయం అనే సంకల్పంతో చేర్యాల లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అందరినీ చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎక్కడైనా ఎవరైనా మరణించారన్న విషయం తెలియగానే క్లబ్ ప్రతినిధులు స్పందించి నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించి మృతుల కుటుంబాలను ఒప్పించి నేత్రాలను సేకరిస్తున్నారు. వాటిని హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని ఐ ఇన్‌స్టిట్యూట్స్‌కు నిర్ణీత కాలంలో పంపిస్తున్నారు. తద్వారా అనతికాలంలోనే చేర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 160 జతల నేత్రాలను సేకరించి ఎంతోమంది అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదింపజేశారు సభ్యులు. ఎన్నో ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

స్వచ్ఛందంగా ముందుకు

చేర్యాల లయన్స్‌క్లబ్ ప్రతినిధుల కృషితో ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకొస్తున్నారు. గతంలో నేత్రదానంపై ప్రజలు ఎన్నో అపోహలు, అనుమానాలు వ్యక్తంజేసేవారు. ఈ నేపథ్యంలో క్లబ్ సభ్యులు అందరికీ అవగాహన కల్పించారు. దీంతో స్ఫూర్తి పొందిన జనం ఇంట్లో ఎవరు చనిపోయినా నేత్రదానం చేస్తామని చెబుతున్నారు. అంధుల జీవితాల్లో వెలుగు నింపేందుకు సహకరిస్తున్నారు.

సూచనలివే

- వ్యక్తి మరణించిన 6 గంటల్లోగా నేత్రాలు సేకరించాలి. కంటి అద్దాలు ధరించేవారు, మధుమేహ రోగులు, అధిక రక్తపోటు, కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారి నేత్రాలను కూడా దానం చేయవచ్చు.
- ఎయిడ్స్, కామెర్లు, కుక్కకాటు, సిఫిలిస్, రక్త క్యాన్సర్, కుష్ఠు, నీటిలో మునిగడం, ఒల్లు కాలడం వల్ల మరణించిన వారి కళ్లు కార్నియాగ్రాఫ్టింగ్‌కు పనికి రావు. కానీ పరిశోధనలకు వినియోగిస్తారు.
- ఇళ్లలో, బంధువుల ఇళ్లలో గానీ మరణిస్తే ముందుగా నేత్రదాన కేంద్రానికి, అందుబాటులో ఉన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల కు సమాచారం అందించాలి. గదిలో ఫ్యాన్ ఆఫ్ చేసి మృతుడి కళ్లు మూసివుంచి కంటిరెప్పలపై తడిగుడ్డను గానీ, గుడ్డపై ఐస్ ముక్కలుగానీ ఉంచాలి.
- మృతుడి తలకింద తలగడను ఉంచాలి. నిపుణులు మృతుని వద్దకే వచ్చి 15-20నిమిషాలలో ప్రక్రియను పూర్తి చేస్తారు.

నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ఆశిస్తున్నాం



నేత్రదానంపై చేర్యాల ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పిస్తూ 160 జతల నేత్రాలను సేకరించాం. ఎన్నో వైద్యశిబిరాలు నిర్వహించాం. అపోహలు వీడిన ప్రజలు స్వచ్ఛంధంగా నేత్రదానానికి ముందుకు వస్తుండటం హర్షణీయం. కానీ ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలని ఆశిస్తున్నాం. ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- డాక్టర్ వీరబత్తిని సత్యనారాయణ, కంటి వైద్య నిపుణుడు, చేర్యాల

సమాచారం అందగానే సేకరణ



ఎవరైనా మరణించారని తెలియగానే క్లబ్ సభ్యులం సంఘన స్థలాకిఇ చేరుకుని నేత్రాలు సేకరిస్తున్నాం. గ్రామీణ ప్రాంతంలోని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అంధత్వ నివారణకు పాటుపడుతున్నాం. నేత్రదానం చేసేందుకు స్వచ్ఛంధంగా ముందుకురావాలి.

- పుర్మ వెంకట్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చేర్యాల

వాహనదారులూ..
ఇలా చేస్తే మంచిది



- పది సూత్రాలు పాటిస్తే చాలు.. పలు ప్రయోజనాలు
- డ్రైవింగ్‌లో జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాలనూ నివారించొచ్చు

కంది : వాహనదారుల ప్రయోజనార్థం పది సూత్రాలు ఉన్నాయి. వాటిని పాటిస్తే అనేక సమస్యలను అధిగమించవచ్చు. డ్రైవింగ్‌లో చిన్న చిన్న మార్పుల ద్వారా చాలా ప్రయోజనాలు చేకూరుతాయి. నియమ నిబంధనలతో వాహనాలను నడిపితే ఇంధన పొదుపు రక్షణ ఉంటుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో పర్యావరణానికి కూడా మేలు చేసిన వాళ్లమవుతాం. కాలుష్యం పెరిగితే వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశామున్నందన సాధ్యమైనంత మేరకు క్నొన సూచనలు పాటిస్తే కాలుష్యాన్ని తరిమికొట్టవచ్చు. రవాణా శాఖాధికారులు చెబుతున్న ఆ పది సూత్రాలు ఏమిటో మీరూ చదివి వాటిని పాటించండి.

- వాహనం నడిపే సమయంలో అకస్మాత్తుగా బ్రేక్ వేయడం, అదే ఊపులో స్టార్ట్ చేయడం మానుకోవాలి.
- ముందు వెళ్తున్న వాహనాలకు మీ వాహనానికి సాధ్యమైనంత దూరం పాటించాలి. వేగం నిలకడగా ఉండేలాగా చూసుకోవాలి.
- గేర్లను 2000 నుంచి 2500 ఆర్‌పీఎంలోనే మార్చాలి. ఇంజన్ స్పీడును సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూడాలి.
- టైర్లలో గాలి సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. తక్కువ గాలి ఉన్న టైర్లతో వాహనాన్ని నడిపితే ఇంధన వినియోగం పెరుగుతుంది. తక్కువ గాలి కలిగిన టైర్లకు రోడ్‌పై గ్రిప్ తక్కువగా ఉండి వాహనం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది.
- వాహనం స్పీడుగా వెళ్లినప్పుడు విండోస్ క్లోజ్ చేయాలి. తెరిచి ఉంచితే ఇంధనం ఎక్కువగా ఖర్చు అవుతుంది.
- వాహనం ఇంజన్‌కు ఎయిర్ కండీషన్ ఉండేలా చూసుకోవాలి. చాలా పట్టణాలు, నగరాల్లో భారీ ట్రాఫిక్ ఉన్నందున ఇంజన్ ఎక్కువ వేడి కాకుండా చూసుకోవాలి.
- రైల్వే క్రాసింగ్, ట్రాఫిక్ జాం, సిగ్నల్స్‌ల వద్ద ఇంజన్ ఆపు చేసి ఉంచాలి.
- వాహనాలకు అదనపు హంగుల పేరిట రూఫ్ ర్యాక్స్, లగేజీ క్యారియర్స్ వంటి వాటిని జోడిస్తే రోడ్లు, వైర్లు, ఇంధనం, వాహనం ఇంజన్‌తోపాటు ప్రయాణించే వారికి నష్టం కలుగుతుంది.
- ఎలక్ట్రానిక్ వస్తువులను సాధ్యమైనంత తక్కువగా ఉపయోగించాలి. దీనివల్ల బ్యాటరీతో పాటు ఇంధనం ఆదా అవుతుంది.
- వాహనంలో పరిమితికి మించి బరువు వేయరాదు. వేస్తే డీజిల్/పెట్రోల్ ఎక్కువ ఖర్చు అవడమే కాకుండా పొగ ఎక్కువగా వచ్చి కాలుష్యాన్ని వెదజల్లుతుంది.

అక్రమార్కులకు అడ్డుకట్ట

- అటవీ రక్షణకు కందకాలు తవ్వకం పూర్తి
- గుంతలతో పాటు మట్టిగడ్డపై ప్రత్యేకంగా మొక్కల పెంపకం
- నర్సాపూర్ అటవీ రేంజ్ పరిధిలో 27 కి.మీలకు 25 కి.మీ పూర్తయిన పనులు
- అటవీసంపద కొల్లగొట్టే వారికి చెక్‌పెట్టే యత్నం

నర్సాపూర్: అటవీ ప్రాంత రక్షణకు అటవీ శాఖ చేపట్టిన ప్రత్యేక చర్యల వల్ల మంచి ఫలితాలు ఇస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు అటవీ ప్రాంత రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అన్యాక్రాంతం చేయడంతో పాటు అటవీ ప్రాంతంలో విలువైన కలప, రాళ్లు, ఇసుక, ఇతర ప్రకృతి సంపదను అక్రమార్కులు కొల్లగొడుతూ వచ్చారు. దీంతో గతంలో నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న పచ్చదనం రోజురోజుకు తగ్గుతూ వచ్చింది. నర్సాపూర్ ప్రస్తుత రేంజ్ పరిధిలో రెండు వేల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం కల్గి ఉంది. దీని పరిధిలో ప్రధాన రోడ్లకు పక్కన కందకాలు తవ్వడానికి అటవీ శాఖ నిర్ణయించింది. నర్సాపూర్ రేంజ్ పరిధిలో 27కిలో మీటర్ల మేర కందకాలు తవ్వాల్సి ఉండగా, ఇప్పటికే 25 కిలో మీటర్లు పూర్తి చేయగా, ఇంకా రెండు కిలో మీటర్ల మేర తీయాల్సి ఉంది. కందకాలు తవ్వడం వల్ల ప్రధాన రోడ్డు సమీపంలో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని పెద్ద లోతైన కాలువ తీయడంతో పాటు కాలువలోని మట్టిని రోడ్డు వైపు ఎత్తుగా పోస్తున్నారు. దీనివల్ల అటవీప్రాంతంలోకి ఏ చిన్న వాహనం కూడా వెళ్లడానికి వీలులేకుండా ఉంటుంది. పైగా ఆ మట్టిగడ్డపై ప్రస్తుతం హరితహారంలో భాగంగా ప్రత్యేకంగా మొక్కలు కూడా పెరుగుతున్నాయి. ఈ మొక్కలు కూడా ముళ్లతో కూడినవి ఉండటం విశేషం. ఎవరైనా అటవీప్రాంతంలోకి వెళ్లడానికి ఏ మాత్రం వీలు లేకుండా ఈ కందకాలు దోహదపడనున్నాయి. పైగా లోతైనా కందకం తీయడం వల్ల వర్షాకాలం వర్షం నీరు అందులో నిల్వ ఉండి అటవీ ప్రాంతంలోని చెట్లకు ఎంతో దోహదపడే అవకాశముంది. ఇన్నాళ్లు అటవీప్రాంతం నుంచి అక్రమంగా కలపతో పాటు ఇసుక, ఇతర ప్రకృతి సంపదను కొల్లగొట్టిన అక్రమార్కులకు ఇక చెక్ పెట్టినట్లైందని చెప్పవచ్చు. రేంజ్ పరిధిలో తీసిన కందకం పక్కకు ఉన్న మట్టి గడ్డపై కానుగ, గచ్చకాయ, బాంబో, అల్లనేరెడు తదితర మొక్కలను ఇప్పటికే నాటారు. అవి పెద్దగా అయితే ఆ మట్టిగడ్డను దాటి అటవీ ప్రాంతంలోకి వెళ్లడాకిఇ ఏ మాత్రం అనువుగా ఉండే అవకాశం ఉండదని చెప్పవచ్చు. ఏదిఏమైనా ఇన్నాళ్లకు అటవీ సంపద రక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం అభినందనీయమని చెప్పవచ్చు. అయితే నాటిని మొక్కలతో పాటు తీసిన కందకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాటిని కాపాడాల్సిన బాధ్యత స్థానిక అటవీశాఖ అధికారులపై ఉంది. లేకుంటే అక్రమార్కులు కందకాలు తొలగించడానికి కూడా ప్రయత్నాలు చేసే అవకాశముంది.

అటవీ సంపద రక్షణకు ప్రత్యేక చర్యలు



నర్సాపూర్ రేంజ్ పరిధిలో అటవీసంపద రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. అందులో భాగంగా రేంజ్ పరిధిలో కందకాల తవ్వకం చివరి దశకు వచ్చింది. కందకాలపై ప్రత్యేకంగా హరితహారంలో భాగంగా ప్రత్యేకమైన మొక్కలు కూడా ఏర్పాటు చేసి అటవీ ప్రాంతంలోకి ప్రకృతి సంపద కొల్లగొట్టడానికి వెళ్లే వీలు లేకుండా చేస్తున్నాం. ప్రజలు అటవీసంపద రక్షణకు సహకరించాలి.

- రాఘువేంద్రరావు, ఎఫ్ఆర్‌వో



నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కన తీసిన కందకం

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!





'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.

- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

(తలకిందులుగా ముద్రించబడింది)

చెప్పగలరా? : వదన

జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ► ....
2. వియోనిగం ► ....
3. భాతంసుప్ర ► ....
4. చాపంయతి ► ....

చుక్కలు కలపండి



సెప్టెంబర్ 1న బ్రహ్మాండమైన విడుదల



PRASADS మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్
PVR సెంట్రల్ మాల్ ఎ/సి - పంజాగుట్ట
PVR ఫోరం మాల్ ఎ/సి - కూకట్‌పల్లి
INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్
INOX ఎం.పి మాల్ ఎ/సి - కాచిగూడ
BIG Cinemas బిగ్‌సినిమాస్ ఎ/సి - అమీర్‌పేట్
BIG Cinemas లియోనియో ఎ/సి - శామీర్‌పేట్
Cinépolis మంజీరా మాల్ ఎ/సి - కూకట్‌పల్లి
Cinépolis CCPL మల్టీప్లెక్స్ ఎ/సి - మల్కాజ్‌గిరి
Cinépolis మంత్రామాల్ ఎ/సి - అత్తాపూర్
TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్
Cine Planet సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
తాళ్లూరి - ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్
ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్
ASIAN CINEPRIDE లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
ASIAN జిపిఆర్ ఎ/సి - కూకట్‌పల్లి
ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్
ASIAN RADHIKA రాధిక మల్టీప్లెక్స్ ఎ/సి - కాప్రా
ASIAN SHIVA GANGA శివగంగ ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
Cinetown సినీటౌన్ ఎ/సి - మియాపూర్
MULTIPLEX విజయలక్ష్మి ఎ/సి - ఎల్.బి.నగర్
ASIAN SHAH SHAHENSHAH షా షహెన్‌షా ఎ/సి - చింతల్
ASIAN శ్రీదేవిమాల్ - హన్మకొండ
GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామాబాద్
SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్
ఎస్‌2 సినిమాస్ - వరంగల్

సంధ్య 70 - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్

అడ్వాన్స్ బుకింగ్ ఇవ్వబడును

భ్రమరాంబ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి

సత్యం ఎ/సి - అమీర్‌పేట్
వైజయంతి ఎ/సి - నాచారం
అలంకార్ ప్రతాప్ - లంగర్‌హౌజ్
మంజు ఎ/సి - సికింద్రాబాద్
రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్
విమల్ ఎ/సి - బాలానగర్
స్వప్న 70 ఎ/సి - కాటేదాన్
అంబ ఎ/సి - మెహిదీపట్నం
విజేత 70 ఎ/సి - బోరబండ
సంపూర్ణ ఎ/సి - వనస్థలిపురం
సాయిరంగ ఎ/సి - మియాపూర్
ముక్తా ఎ2 రామకృష్ణ 35 - అబిడ్స్
హైటెక్ ఎ/సి - మాదాపూర్

జ్యోతి 70 ఎ/సి - ఆర్.సి పురం
శ్రీదేవి ఎ/సి - చిలకలగూడ
SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట్
శివశక్తి 70 ఎ/సి - కాప్రా
SVC ఈశ్వర్ ఎ/సి - అత్తాపూర్
శ్రీనివాస 70 ఎ/సి - ఉప్పల్
SVC సంగీత్ ఎ/సి - ఆర్.సి.పురం
శ్రీరాములు ఎ/సి - మూసాపేట్
నాగేంద్ర ఇంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్
సూపర్ 70 ఎ/సి - బాలాపూర్
శ్రీరామా ఎ/సి - బహదూర్‌పుర
ముకుంద్ 70 ఎ/సి - మేడ్చల్
సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్
సంతోష్ ఎ/సి - ఇబ్రహీంపట్నం

కళ్యాణి మూవీమ్యాక్స్ - బోయిన్‌పల్లి
నర్తకి 70 ఎ/సి - అల్వాల్
శివరంజని ఎ/సి - ఇస్నాపూర్
జగదాంబ ఎ/సి - ఘట్‌కేసర్
రుక్మిణి ఎ/సి - పటాన్‌చెరు
శ్రీకృష్ణ ఎ/సి - అలియాబాద్
సాయిపూజ ఎ/సి - సూరారం
శ్రీప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ
జ్యోతి ఎ/సి - ఐడిఎ బొల్లారం
గణేష్ 70 ఎ/సి - శంషాబాద్
రంగ భుజంగ కాంప్లెక్స్ - జీడిమెట్ల

మరియు మీ అభిమాన థియేటర్లలో

GLOBAL CINEMAS GLOBAL CINEMAS LLP.,



లక్ష్మణ్ ఎ/సి - వరంగల్	జయశ్రీ - నర్సంపేట్	వెంకటేశ్వర- జోగిపేట్
నర్తకి ఎ/సి - ఖమ్మం	సుజన ఎ/సి - చిట్యాల	సాయిరాం - రామయంపేట్
కళాంజలి - ఇల్లందు	శ్రీనివాస - పెద్దపల్లి	శ్రీనివాస - హుజూర్‌నగర్
మమత - కరీంనగర్	అంజిరెడ్డి - చౌటుప్పల్	వెంకట్రామ - నేరేడుచర్ల
బాలాజీ - మహబూబ్‌నగర్	లక్ష్మి ఎ/సి - మెట్‌పల్లి	శ్రీనివాస - కడ్తాల్
వెంకటేశ్వర - కోదాడ	లక్ష్మి ఎ/సి - కోరుట్ల	కమల ఎ/సి - భైంసా
SVC దేవి - జనగాం	అచ్చిరెడ్డి - హాలియా	బాలాజీ ఎ/సి - చేర్యాల



సుదర్శన 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.15,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System


PRASADS 11.30,5.00,8.15	TIVOLI 11.00,10.00PM	ASIAN - అత్తాపూర్ 1.30PM
PVR - మాదాపూర్ 1.00,7.25	Cine Planet - కొంపల్లి 1.50,7.40PM	ASIAN - కాప్రా 1.40,7.30
PVR - బంజారాహిల్స్ 4.00PM	మీరజ్ - దిల్‌సుఖ్‌నగర్ 4.40PM	ASIAN - దిల్‌సుఖ్‌నగర్ 2.00,6.00
PVR - పంజాగుట్ట 11.00AM, 7.15PM	ASIAN - ఉప్పల్ 1.45,7.45	MULTIPLEX - ఎల్‌బినగర్ 2.00,7.30
PVR - కూకట్‌పల్లి 11.00,7.45,10.30	ఇసిఐఎల్ - 2.15,9.15	Cinetown - మియాపూర్ 2.30PM
Cinemas Ameerpet ఎ/సి - అమీర్‌పేట్ 7.30PM	INOX - బంజారహిల్స్ 2.25,7.25	ASIAN - హన్మకొండ - 4.50PM
Cinépolis ఎ/సి - కూకట్‌పల్లి 4.50PM	INOX ఎంపి - కాచిగూడ 4.20PM	GEETHA ASIAN నిజామాబాద్ - 4.40PM
Cinépolis - మల్కాజ్‌గిరి 4.40PM	ASIAN - కూకట్‌పల్లి 7.30PM	ఎస్2 సినిమాస్ - 2.05,7.35

లక్ష్మీకళా సినీప్రైడ్ - మూసాపేట్ 11.30,2.30,6.15	జ్యోతి - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15
విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45	శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15	సుష్మ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00	మహేశ్వరి- మహేశ్వరం 11.00,2.00,6.00,9.00

SVC ప్రతిమ 70 ఎ/సి - కరీంనగర్ | SVC రామకృష్ణ - షాద్‌నగర్

వరంగల్	కరీంనగర్	మహబూబ్‌నగర్	
రామ్ ఎ/సి - వరంగల్	తిరందాజ్ - కరీంనగర్	తిరుమల కాంప్లెక్స్ - మహబూబ్‌నగర్	రంగ ఎ/సి - కోదాడ
అమృత - హన్మకొండ	న్యూఅశోక - గోదావరిఖని	శ్రీనివాస ఎ/సి - వనపర్తి	**ఆదిలాబాద్**
జయశ్రీ ఎ/సి - నర్సంపేట్	బాలాజీ ఎ/సి - జగిత్యాల	వెంకటేశ్వర - గద్వాల్	మహేశ్వరి - ఆదిలాబాద్
ఖమ్మం	**నిజామాబాద్**	బాబా - నారాయణ్‌పేట్	శ్రీనివాస - మంచిర్యాల
వినోద ఎ/సి - ఖమ్మం	విజయ ఎ/సి - నిజామాబాద్	శ్రీనివాస ఎ/సి - జడ్చర్ల	నారాయణ ఎ/సి - నిర్మల్
దుర్గా ఎ/సి - కొత్తగూడెం	ప్రియా ఎ/సి - కామారెడ్డి	పరమేశ్వరి - కొత్తకోట	**మెదక్**
ఉదయ్‌భాస్కర్ - భద్రాచలం	మహేశ్వరి - బాన్సువాడ	**నల్గొండ**	సీతారామ ఎ/సి- సిద్దిపేట
బాలాజీ ఎ/సి - సత్తుపల్లి	వెంకటేశ్వర - ఆర్మూర్	తిరుమల ఎ/సి- నల్గొండ	రుక్మిణి ఎ/సి - సంగారెడ్డి
సీతారామా - మణుగూరు	వెంకటేశ్వర - బోధన్	శ్రీనివాస - మిర్యాలగూడ	మోహన్ -జహీరాబాద్
		తిరుమల - సూర్యాపేట్	**రంగారెడ్డి**
		వసుంధర - భువనగిరి	లక్ష్మి ఎ/సి - తాండూర్
			భవాని ఎ/సి - పరిగి

RAGHUVARAN IS BACK
నేడే చూడండి




సప్తగిరి 70 ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

రాఘవేంద్ర 35 ఎ/సి - మల్కాజ్‌గిరి 11.15,2.15
కుమార్ - కాచిగూడ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్ 11.15,2.15,6.15,9.00
సంతోష్ - అబిడ్స్ 11.30,2.30,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
SVC మహాలక్ష్మి - కొత్తపేట్ 11.00,2.00,6.00,9.00
శారద 70 ఎంఎం ఎ/సి - కాప్రా 6.00,9.00
SV సినీస్క్వేర్ - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ సన్‌షైన్ ఎ/సి - ఖైరతాబాద్ 6.00PM
సెన్సేషన్ ఇన్సోమ్నియ ఎ/సి - ఖైరతాబాద్ 2.15 PM
నర్తకి 70 ఎ/సి - అల్వాల్ 11.15,2.15,6.15,9.15
ఆరాధన 70 ఎంఎం ఎ/సి - తార్నాక 6.00,9.00

Cinepride మూసాపేట్ 11.00,2.30,9.30	Cinemas Shameerpet ఎ/సి - శామీర్‌పేట్ 11.00,7.20
ASIAN ఉప్పల్ 10.30,7.30,10.30	Cinépolis ఎ/సి - కూకట్‌పల్లి 12.00,5.00
ASIAN కూకట్‌పల్లి 10.00,7.40PM	Cinépolis - మల్కాజ్‌గిరి 11.00,5.05PM
ASIAN ఎ/సి - అత్తాపూర్ 10.30,7.40	Cinépolis అత్తాపూర్ 11.00,5.05PM
ASIAN RADHIKA రాధిక ఎ/సి - కాప్రా 7.35PM	TIVOLI ఎ/సి - సికింద్రాబాద్ 2.00PM
ASIAN ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 6.00PM	Cine Planet కొంపల్లి 10.30,7.30,10.40
ASIAN SHAH SHAHENSHAH ఎ/సి - చింతల్ 2.30 PM	ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.30,7.35 PM
PRASADS ఎన్.టి.ఆర్ గార్డెన్ 12.30,8.15	ASR Swapna కాటేదాన్11.00,2.00,6.00,9.00
PVR ఎ/సి - మాదాపూర్ 11.00,7.45	ఎ/సి - ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 2.15 PM
PVR ఎ/సి - బంజారాహిల్స్ 1.00,11.00	Cinetown ఎ/సి - మియాపూర్ 2.30,6.00
PVR ఎ/సి - పంజాగుట్ట 12.00,7.45PM	MULTIPLEX ఎ/సి - ఎల్.బి.నగర్ 1.30,10.30
PVR కూకట్‌పల్లి 10.45,3.50,10.40	ASIAN హన్మకొండ 10.25,7.40PM
INOX బంజారాహిల్స్ 11.00,7.40PM	GEETHA ASIAN నిజామాబాద్ 1030,7.35,10.40
INOX ఎ/సి - కాచిగూడ 11.20,7.15PM	SVC ప్రతీమ ఎ/సి - కరీంనగర్
Cinemas Ameerpet ఎ/సి - అమీర్‌పేట్11.00,7.30	ఎస్2 సినిమాస్ - వరంగల్

తిరుమల - కరీంనగర్	సాగర్ డీలక్స్ - మెదక్	సాయిరాం - పోచంపల్లి
ప్రతిమ - కరీంనగర్	సంతోష్ - రామాయంపేట	వెంకటలక్ష్మి ఎ/సి - చర్ల
దుర్గ ఎ/సి - జగిత్యాల	అశోక ఎ/సి - కల్వకుర్తి	వెంకటేశ్వర - తిరుమలగిరి
శ్రీనివాస - గోదావరిఖని	అలంకార్ - సూర్యాపేట్	వెంకటేశ్వర - మర్రిపెడ
ఆదిత్య ఎ/సి - ఖమ్మం	వెంకట్రామ - వరంగల్	GLOBAL CINEMAS
పరమేశ్వరి - కొత్తగూడెం	సాంబవి ఎ/సి - కాజీపేట్	
వేణుగోపాల్ - పాల్వంచ	సంతోష్ - రామాయంపేట్	

సెప్టెంబర్ 1న
బ్రహ్మాండమైన విడుదల



PRASADS మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్	మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	Cinepride లక్ష్మీకళ - మూసాపేట్
PVR సెంట్రల్ మాల్ ఎ/సి - పంజాగుట్ట	ASIAN జిపిఆర్ ఎ/సి - కూకట్‌పల్లి
PVR ఫోరం మాల్ ఎ/సి - కూకట్‌పల్లి	ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్
Cinépolis మంజీరా మాల్ ఎ/సి - కూకట్‌పల్లి	ASIAN RADHIKA రాధిక ఎ/సి - కాప్రా
Cinépolis CCPL ఎ/సి - మల్కాజ్‌గిరి	ASIAN శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్	Cinetown సినీటౌన్ - మియాపూర్
INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్	MULTIPLEX విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
INOX ఎం.పి మాల్ ఎ/సి - కాచిగూడ	ASIAN షా షహెన్‌షా - చింతల్
Cinemas Ameerpet బిగ్‌సినిమాస్ ఎ/సి - అమీర్‌పేట్	ASIAN శ్రీదేవిమాల్ - హన్మకొండ
Cinemas Shameerpet లియోనియో ఎ/సి - శామీర్‌పేట్	GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామాబాద్
TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్	INDRA CINEMAS స్వప్నమాల్ ఎ/సి - బీదర్
Cine Planet మల్టీప్లెక్స్ ఎ/సి - కొంపల్లి	

మరియు మీ అభిమాన థియేటర్లలో **INDRA FILMS RELEASE**

కన్నడ కంఠీరవ డా॥ రాజ్‌కుమార్ మేనల్లుడు నటించిన భారీ చిత్రం

సెప్టెంబర్ 1న బ్రహ్మాండమైన విడుదల



అంజలి 70 ఎంఎం ఎ/సి - సికింద్రాబాద్

PRASADS - ఎన్.టి.ఆర్ గార్డెన్	Cinépolis CCPL - మల్కాజ్‌గిరి	ASIAN RADHIKA రాధిక ఎ/సి - కాప్రా
PVR ఎ/సి - మాదాపూర్	Cinépolis ఎ/సి - అత్తాపూర్	ASIAN శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
PVR ఎ/సి - బంజారాహిల్స్	TIVOLI - సికింద్రాబాద్	Cinetown సినీటౌన్ - మియాపూర్
PVR ఎ/సి - పంజాగుట్ట	Cine Planet ఎ/సి - కొంపల్లి	MULTIPLEX విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
PVR ఎ/సి - కూకట్‌పల్లి	మీరజ్ - దిల్‌సుఖ్‌నగర్	ASIAN షా షహెన్‌షా - చింతల్
INOX - బంజారాహిల్స్	ఎ/సి - ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్	ASIAN శ్రీదేవిమాల్ - హన్మకొండ
INOX ఎ/సి - కాచిగూడ	ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్	GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామాబాద్
Cinemas Ameerpet ఎ/సి - అమీర్‌పేట్	Cinepride లక్ష్మీకళ - మూసాపేట్	SVC ప్రతీమ - కరీంనగర్
Cinemas Shameerpet ఎ/సి - శామీర్‌పేట్	ASIAN జిపిఆర్ - కూకట్‌పల్లి	ఎస్2 ఎ/సి - వరంగల్
Cinépolis ఎ/సి - కూకట్‌పల్లి	ASIAN ఎంక్యూబ్ - అత్తాపూర్	

మరియు మీ అభిమాన థియేటర్లలో శ్రీ రాజేశ్వరి ఫిలిమ్స్ - 9030161717, 9912233279

బహురూపం..భజేహం



జహీరాబాద్‌లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ నల్లమల రవి



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని విద్యానగర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



రామచంద్రాపురం ఎంఐజీ ఫేజ్-2లోని వినాయకుడు



జహీరాబాద్‌లోని కృష్ణవేణి పాఠశాల ఆవరణలో నెలకొల్పిన వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



గుమ్మడిదలలో శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలోని గణనాథుడు



రామచంద్రాపురం వినాయక మండపంలో పూజలు చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజిరెడ్డి

వైభవంగా కలశాల శోభాయాత్ర

- అలరించిన చిన్నారుల ఆటపాట

నారాయణఖేడ్ : నారాయణఖేడ్ పట్టణంలో మహిళలు కలశాల శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం ప్రారంభం నుంచి నెహ్రూనగర్‌లో శ్రీరామ విజయం పురాణ పఠనం నిర్వహించారు. ఆదివారం పూర్ణాహుతిని పురస్కరించుకొని సంప్రదాయబద్ధంగా భజనలు కీర్తనలతో శోభాయాత్రను చేపట్టారు. ప్రధాన కూడళ్లల్లో చిన్నారులు నిర్వహించిన పుంగిడి పూత ఆట పలువురిని ఆకట్టుకుంది. వారీకార్ సంప్రదాయంలో భజనలు చేయడమే కాకుండా ఆట పాటలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గులాల్ ఎక్కించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నారాయణఖేడ్‌లో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో సామూహిక అభిషేకాలు

సదాశివపేట రూరల్: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని చెన్న బసవేశ్వర మందిరంలో ఆదివారం సామూహిక అభిషేకాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో పట్టణ పురవీధుల గుండా కలశములను ఊరేగించారు. అనంతరం బసవేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సామూహిక అభిషేకాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉల్లిగడ్డల ఛాయా శాంతుకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు జీర్లపల్లి వెంకటేశం గుప్తా, సభ్యులు శివకుమార్, ఉల్లిగడ్డల నాగరాజు, పాండురంగారెడ్డి, కంది మల్లేశం, గోనె శ్రీనివాస్, మల్లిఖార్జున్, ఆశోక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు ప్లీనరీ స్పీకర్‌గా గీతం ప్రొఫెసర్

పటాన్‌చెరు రూరల్ : గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.త్రినాథరావు కాంబోడియాలో సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు జరగనున్న అంతర్జాతీయ సదస్సులో ప్లీనరీ స్పీకర్‌గా పాల్గొనున్నారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ (సీఎంఈసీఈ-2017) పేరిట నిర్వహిస్తున్న ఈ సదస్సులో పరిశ్రమ, విద్యా సంస్థలకు చెందిన పరిశోధకులు, వృత్తి నిపుణులు పాల్గొని, తమ నూతన శోధనలు, వాటి ఫలితాలను ఇతరులతో పంచుకోనున్నారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ నెట్‌వర్క్స్ పనితీరును ఆయన ఈ సదస్సులో విశ్లేషించనున్నారు. అంతర్జాతీయ సదస్సులో ప్లీనరీ స్పీకర్‌గా పాల్గొనబోతున్న డాక్టర్ పి.త్రినాథరావును గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.సంజయ్, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీఏ రామారావు, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నివాస్, ప్రొఫెసర్ వై.లక్ష్మణ్‌కుమార్ ఆయనను తదితరులు అభినందించారు.



ప్రొ.త్రినాథరావు

రేపు సంగారెడ్డిలో 'రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ'

- ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జావేద్ అలీ

సంగారెడ్డి అర్బన్ : ధ్యాన్‌చందర్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఈనెల 29న సంగారెడ్డిలో రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ నిర్వహిస్తున్నట్టు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జావేద్‌అలీ తెలిపారు. సంగారెడ్డిలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రన్ పట్టణంలోని రాజీవ్ పార్కు నుంచి ప్రారంభమై అంబేద్కర్ మైదానం వరకు కొనసాగుతుందన్నారు. ముఖ్య అతిథ్యులుగా ఎమ్మెల్యే చింతాప్రభాకర్, ఎక్సైజ్ శాఖ డిప్యూటటీ కమిషనర్ శాస్త్రీ, డీఎస్పీ తిరుపతన్నలు పాల్గొంటారన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసలై జీవితాలు పాడు చేసుకోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చైర్మన్ ఎన్.చంద్రశేఖర్, కోకన్వీనర్ హరికిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశం, వాకర్స్ అసోసియేషన్ కన్వీనర్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.